# రైతులు నూతన సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

**పొగాకు బోర్డు అధికారి రాజగోపాల్ రెడ్డి**

**కందుకూరు పెన్ పవర్, జూన్11**



వికసిత కృషి సంకల్ప అభయాన్ కార్యక్రమంలో భాగంగా కోవూరు గ్రామంలో ఐసిఏఆర్, ఎన్ఐఆర్ సిఏ, కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పొగాకు బోర్డు అధికారి రాజగోపాల్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతును సుసంపన్నం చేయడం మనందరి లక్ష్యం కావాలని అన్నారు. వికసిత కృషి సంకల్ప అభయాన్ కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం మే 29 నుండి జూన్ 12 వరకు జరుపుతుందని తెలిపారు. పొగాకు సాగులో నూతన సాంకేతికత ను ఉపయోగించాలని తద్వారా ఆదాయం రెట్టింపు చేయాలని కోరారు. రైతు దేశానికి వెన్నెముక అని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా 1.5 కోట్ల మంది రైతులకు లబ్ధి చేకూరుతుందని చెప్పారు. దాదాపు 65 వేల గ్రామాలకు శాస్త్రవేత్తలు వెళ్తారని ఈ అవకాశాన్ని రైతు సోదరులు వాడుకోవాలని చెప్పారు. పొగాకు సాగులో ఉత్తమ యాజమాన్య పద్ధతులు పాటించి ఖర్చులు తగ్గించు కోవాలని అంతేకాకుండానాణ్యమైన పొగాకును పండించాలని చెప్పారు. పొగాకు బోర్డు ఎల్లప్పుడూ రైతు ఉన్నతికి కృషి చేస్తుందని చెప్పారు. పొగాకు బోర్డు అనుమతి మేరకే పొగాకు సాగు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కందుకూరు శాస్త్రవేత్త గంగాధర్,, పౌల్ట్రీ శాస్త్రవేత్త రాజా రవీంద్ర, ఆర్ బి కే సిబ్బంది పాల్గొన్నారు.

పెన్ పవర్
ప్రకాశం

# రాష్ట్రంలో రైతు సంక్షేమ ప్రభుత్వం

**- రైతులకు అన్నివేళలా అండగా ఉంటాం**

**- రాష్ట్ర మంత్రులు డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి, గొట్టిపాటి రవికుమార్**

**- ఏరువాక పౌర్ణమి కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యేలు జనార్ధన్, విజయకుమార్**

**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ జూన్ 11**











రాష్ట్రంలో రైతు సంక్షేమ కూటమి ప్రభుత్వ పాలన ఉందని, రైతులకు అన్నివేళలా అండగా ఉంటుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి, రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చెప్పారు. జిల్లా వ్యవసాయ శాఖ, పొగాకు బోర్డు ఆధ్వర్యంలో బుధవారం త్రోవగుంటలో వేరువేరుగా నిర్వహించిన ఏరువాక పౌర్ణమి కార్యక్రమాలలో వారు పాల్గొన్నారు. ముందుగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొగాకు వేలం కేంద్రం సమీపంలోని పొలంలో నిర్వహించిన ఏరువాక పౌర్ణమి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన రావు,;;సంతనూతలపాడు శాసనసభ్యులు బి.ఎన్. విజయ్ కుమార్, ఒంగోలు మేయర్ గంగాడ సుజాత, పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్, వైస్ చైర్మన్ బోడపాటి బ్రహ్మయ్య, కార్యదర్శి వేణుగోపాల్, ప్రకాశం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ కామేపల్లి సీతారామయ్యలతో కలిసి పాల్గొన్నారు. నాగలితో పొలం దున్ని రైతులకు ఏరువాక శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పొగాకు వేలం కేంద్రాన్ని సందర్శించి రైతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి ఏరువాక శుభాకాంక్షలు తెలిపారు. కేంద్రంలో పొగాకు కొనుగోలు జరుగుతున్న తీరును వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి స్వామి మాట్లాడుతూ ఒక రైతు బిడ్డగా అన్నదాతల కష్టం తెలిసిన వ్యక్తి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అని అన్నారు. వ్యవసాయం కోసం ప్రత్యేక బడ్జెట్ ను కూడా తమ ప్రభుత్వమే తీసుకొచ్చిందన్నారు. అన్నం పెట్టే రైతు సంతోషంగా ఉండాలని ముఖ్యమంత్రి కోరుకుంటున్నట్లు చెప్పారు. ఈ దిశగానే అవసరమైన చర్యలను తమ ప్రభుత్వం చేపట్టిందన్నారు. గతంలో రైతులకు వ్యక్తిగతంగా అండగా ఉండేలా రాయితీపై పరికరాలను తమ ప్రభుత్వం అందించిందని అన్నారు. నేడు కూడా రాయితీపై వ్యవసాయ పరికరాలను రైతులకు అందించేందుకు 146 కోట్ల రూపాయలను కేటాయించినట్లు చెప్పారు. మ్యాచింగ్ గ్రాండ్స్ లేని కారణంగా గత ప్రభుత్వంలో నిలిచిపోయిన కేంద్ర ప్రభుత్వ పథకాలను కూడా తమ ప్రభుత్వం స్ట్రీమ్ లైన్ చేసిందన్నారు. అన్నదాత సుఖీభవ పథకాన్ని ఈ నెల 20వ తేదీన అమలు చేసి రైతులకు ఆర్థిక ప్రయోజనం చేకూర్చుతామని మంత్రి చెప్పారు. ఫ్రీ హోల్డ్ భూముల క్రమబద్ధీకరణ పేరుతో గతంలో జరిగిన తప్పులను తమ ప్రభుత్వం సరిచేయాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. రైతులకు గత ప్రభుత్వం పెట్టిన బకాయిలను కూడా తమ ప్రభుత్వం చెల్లించినట్లు చెప్పారు. పొగాకు సాగు చేస్తున్న రైతులు నష్టపోకుండా తమ ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు. లోగ్రేడు పొగాకును కూడా కంపెనీలు కొనుగోలు చేసేలా చూడాలని పొగాకు బోర్డు చైర్మన్ ను మంత్రి కోరారు. ఇప్పటికే మంత్రులతో కూడిన కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. పొగాకుతో పాటు ఇతర పంటలు సాగు చేస్తున్న రైతులెవరూ కూడా నష్టపోకుండా ధరల స్థిరీకరణ పై ప్రభుత్వం దృష్టి పెట్టిందన్నారు. మంత్రి రవికుమార్ మాట్లాడుతూ గత రెండేళ్లుగా పొగాకు కొనుగోలుదారులు మంచి లాభాలు ఆర్జించారని, ఈ ఏడాది కూడా సాగుచేసిన పొగాకు మొత్తాన్ని కొనుగోలు చేయాలని అన్నారు. ప్రస్తుతం హై గ్రేడు, మీడియం గ్రేడ్ పొగాకును కొనుగోలు చేస్తున్నారని, లో గ్రేడును కూడా కొనుగోలు చేయాలని ఆయన కోరారు. పొగాకు రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు. నల్లబర్లి రకం పొగాకును ఈనెల 16వ తేదీ నుంచి మార్క్ఫెడ్ ద్వారా కొనుగోలు చేసేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. తమది రైతు ప్రభుత్వం అని, మామిడి, కోకో, ఆయిల్ పామ్ రైతులకు సమస్యలు వస్తే ప్రభుత్వం తక్షణమే స్పందించి ఆదుకున్నదని చెప్పారు. పొగాకు రైతులకు కూడా దన్నుగా ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి కూడా కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడతారని ఆయన తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం చేస్తున్న సహాయాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సాంకేతిక పద్ధతులను అమలు చేయడం ద్వారా దిగుబడి పెంచుకోవచ్చని చెప్పారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చటంపై ప్రభుత్వం దృష్టి పెట్టిందని, ప్రకృతి సేద్యం విధానానికి కూడా అధిక ప్రాధాన్యం ఇస్తున్నదని తెలిపారు. ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు మాట్లాడుతూ రైతులను ఆదుకోవడంలో కంపెనీలు కూడా బాధ్యత తీసుకోవాల్సి ఉంటుందన్నారు. గత ఏడాది మాదిరిగానే ఈసారి కూడా పంట మొత్తాన్ని కొనుగోలు చేయాలని చెప్పారు. అలాగాకుండా కంపెనీలు తమ ఇష్టం వచ్చినట్లు కొనుగోలు చేస్తామంటే సరికాదన్నారు. స్థానిక పరిస్థితులను కంపెనీలు తమ యాజమాన్యాల దృష్టికి తీసుకువెళ్లాలని ఆయన సూచించారు. ఎమ్మెల్యే విజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం, బోర్డు తమను ఆదుకోవడం లేదనే అభిప్రాయంలో పొగాకు రైతులు ఉన్నారని వ్యాఖ్యానించారు. ముందుగా పొగాకు బోర్డు, ఐటిసి అవసరమైన చర్యలు తీసుకొని లోగ్రేడ్ పొగాకు కూడా కొనుగోలు చేసేలా చూడాలన్నారు. పొగాకు బోర్డు చైర్మన్ మాట్లాడుతూ ప్రస్తుతం 60 నుంచి 70 మిలియన్ కేజీల లోగ్రేడ్ పొగాకు ఉన్నట్లు చెప్పారు. బోర్డు ఎల్లప్పుడూ రైతుల పక్షమే ఉంటుందన్నారు. లోగ్రేడ్ పొగాకును కూడా కంపెనీలు కొనుగోలు చేసేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమాలలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, ప్రకృతి సేద్యం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ సుభాషిణి, జిల్లా ఉద్యానశాఖ అధికారి గోపీచంద్, మార్క్ఫెడ్ డి.ఎం. హరికృష్ణ, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మానాయక్ , ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అర్జున్ నాయక్, ఏపీ సి.పి.డి.సి. ఎల్. ఎస్.ఈ. వెంకటేశ్వర్లు, ఇతర అధికారులు , స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.






## రైతు సంక్షేమాన్ని విస్మరించిన తెలుగు దేశ ప్రభుత్వం

# మండిపడ్డ వైయస్ జగన్





**పొదిలి, పెన్ పవర్, జూన్ 11**

రాష్ట్రంలోని తెలుగుదేశ ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని మాజీ రాష్ట్ర ముఖ్యమంత్రి, వైయస్సార్ సిపి రాష్ట్ర అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు బుధవారం నాడు ఆయన స్థానిక పొగాకు బోర్డును సందర్శించారు అలాగే అక్కడ జరుగుతున్న వేలం ప్రక్రియలో పాల్గొని పొగాకు ధరలను పరిశీలించారు అలాగే పొగాకు బోర్డు అధికారులు, పొగాకు కంపెనీల ప్రతినిధులతో జగన్ మాట్లాడారు అదేవిధంగా పొగాకు రైతులను మాట్లాడి వారి కష్టనష్టాలను స్వయంగా తెలుసుకున్నారు అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జగన్ మాట్లాడుతూ పొగాకు రైతుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం అమలిందిస్తున్న వైఖరిని తీవ్రంగా దుయ్యబట్టారు వ్యాపారులు సిండికేట్ గా మారి, గిట్టుబాటు ధరలు రాకుండా పొగాకు రైతుల కు అన్యాయం చేస్తున్నారని జగన్ మండిపడ్డారు పొగాకు విక్రయాల సీజన్ ముగుస్తున్నప్పటికీ, ఇప్పటికీ రైతులు తమ పొగాకును పూర్తిగా విక్రయించుకోలేకపోయారని జగన్ చెప్పారు గిట్టుబాటు ధరలు రాకపోవడంతో అప్పుల బాధతో జిల్లాలో ఇద్దరు రైతులు ఆత్మహత్యలకు పాల్పడటం ఎంతో బాధాకరమని ఆయన చెప్పారు అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వానికి చీమకుట్టినట్లైనా ఉండటం లేదని జగన్ ఆక్షేపించారు తమ ప్రభుత్వ హయాంలో రైతు రాజ్యం నడిచిందని, రైతులు అన్ని విధాలా సుభిక్షంగా ఉన్నారని జగన్ చెప్పారు వైసీపీ పాలనలో రైతన్న పంట వేసే సమయంలో రైతు భరోసా తో ప్రభుత్వం రైతులను ఆదుకుందని, ప్రస్తుత చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ఆ పథకాన్ని నీరు కార్చిందని జగన్ విమర్శించారు సీజన్ ముగిసేనాటికి రైతులకు ఇన్పుట్ సబ్సిడీ ఇచ్చే సాంప్రదాయానికి చంద్రబాబునాయుడు ప్రభుత్వం తిలోదాకాలిచ్చిందని జగన్ ఆక్షేపించారు అలాగే తమ ప్రభుత్వ హయాంలో రైతులకు ఉచితంగా పంట బీమా చేయడం జరిగిందని ప్రస్తుత చంద్రబాబు ప్రభుత్వం ఆ పథకాన్ని కూడా ఎత్తివేసిందని జగన్ విమర్శలు గుప్పించారు నకిలీ విత్తనాలు, కల్తీ ఎరువులు, పురుగుమందులతో రైతులు నష్టపోతున్నప్పటికీ, ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదని జగన్ విమర్శించారు తమ ప్రభుత్వ హయాంలో మూడు వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేసి రైతులకు న్యాయమైన ధరలు లభించేలా చూసామని జగన్ చెప్పారు రైతులు అధైర్య పడవద్దని, రైతులకు అండదండగా తాము నిలుస్తామని జగన్ రైతులకు భరోసా ఇచ్చారు పట్టణ శివారులోని దర్శి రోడ్డులో గల ఎస్సార్ పెట్రోల్ బంకు వద్ద హెలికాప్టర్ దిగిన జగన్మోహన్ రెడ్డి పొగాకు బోర్డు వరకు రోడ్ షో నిర్వహించారు జగన్ రాకతో పొదిలి పట్టణం జనసంద్రంగా మారింది ప్రజలు, వైకాపా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు జగన్ ను చూసేందుకు ఎగబడటంతో వారిని అదుపు చేయడం పోలీసులకు కూడా కష్టసాధ్యంగా మారింది ఈ కార్యక్రమంలో శాసనమండలి సభ్యులు వైవి సుబ్బారెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైసిపి రీజినల్ కోఆర్డినేటర్, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, వైకాపా జిల్లా పార్లమెంటు నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, జిల్లా వైకాపా అధ్యక్షులు, దర్శి నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి, ఎర్రగొండపాలెం నియోజకవర్గ శాసనసభ్యులు తాటిపర్తి చంద్రశేఖర్, వైకాపా ఒంగోలు పార్లమెంటరీ పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి, రాష్ట్ర వైకాపా ప్రధాన కార్యదర్శి జూపూడి ప్రభాకర్ రావు, మాజీ మంత్రులు ఆదిమూలపు సురేష్, మేరుగా నాగార్జున, మార్కాపురం నియోజకవర్గ వైకాపా సమన్వయకర్త అన్నా రాంబాబు, మాజీ ఎమ్మెల్యేలు జంకి వెంకటరెడ్డి, ఉడుముల శ్రీనివాసరెడ్డి, పీజే సుధాకర్, నాగార్జున రెడ్డి, ఒంగోలు నియోజక వర్గ ఇన్చార్జి చుండూరు రవి, రాష్ట్ర వైకాపా పంచాయతీరాజ్ విభాగపు కార్యదర్శి సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, వైకాపా రాష్ట్ర కార్యదర్శి కె.వి.రమణారెడ్డి, జిల్లా వైకాపా కార్యదర్శి గొల్లమారి రమణారెడ్డి, జిల్లా వైకాపా అధికార ప్రతినిధి మెట్టు వెంకటరెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్లు గుజ్జుల రమణారెడ్డి, వై వెంకటేశ్వరరావు, జిల్లా సేవాదళ్ అధ్యక్షులు గుజ్జుల సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఒకరు మృతి, మరొకరికి గాయాలు



**గిద్దలూరు పెన్ పవర్ జూన్ 11**

గిద్దలూరు మండలం దిగువమెట్ట సమీపంలో నల్లమల్ల ఘాట్ రోడ్డులో రోడ్డు ప్రమాదం బుధవారం చోటుచేసుకుంది .ఎదురెదురుగా కారు బైక్ ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా మరొకరికి బలమైన గాయాలు తగిలాయి. కారు ద్విచక్ర వాహనం ఢీకొని ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ఇద్దరిలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలు తగిలాయి మృతుడు ముండ్లమూరు మండలం ఈదర గ్రామానికి చెందిన రామాంజనేయులు(22)గా గుర్తించారు. గాయపడ్డ మరో వ్యక్తి షేక్ బాజీని వైద్యం కోసం గిద్దలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. జరిగిన ప్రమాదంపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. వ్యక్తిగత పనులపై మృతుడు క్షతగాత్రుడు నంద్యాల వెళ్లి తిరిగి వస్తుండగా రోడ్డు ప్రమాదానికి గురైనట్లుగా పోలీసులు తెలిపారు .

## ప్రైవేటు స్కూలు బిల్డింగ్ స్లాబ్ పనుల్లో యువకుడు మృతి



**చంద్రశేఖరపురం, పెన్ పవర్ జూన్ 11**

నెల్లూరు జిల్లా సీతారాంపురం గ్రామంలో ప్రైవేటు పాఠశాల భవనం నిర్మాణ పనుల్లో చంద్రశేఖరపురం పట్టణంనకు చెందిన బండారు సురేష్ (22) మృతి చెందారు జీవనోపాధి కొరకు పనుల నిమిత్తం సీతారాంపురం నకు వెళ్లారు ప్రైవేటు పాఠశాల బిల్డింగు స్లాబు పనుల్లో భాగంగా డీసీఎం వ్యాను- మిల్లర్ కు మధ్యలో ఉన్న లింకును తొలగించే క్రమంలో అదుపుతప్పి ఒక్కసారిగా మిల్లర్ సురేష్ మీదికి దూసుకెళ్లింది తప్పించుకొనుటకు అవకాశం లేక డిసియం వ్యాను- మిల్లరు మధ్యలో చిక్కుకోవడంతో సురేష్ మృతి చెందారు.

## సిపిఐ మహాసభలను జయప్రదం చేయండి



**చంద్రశేఖరపురం, పెన్ పవర్ జూన్ 11**

చంద్రశేఖరపురం మండలంలోని అగ్రహారం గ్రామములోని ఎస్టీ కాలనీలో భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో మేకల అంకయ్య అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు గ్రామ సభకు ముఖ్యఅతిథిగా మండల ప్రధాన కార్యదర్శి యస్ కె వై పెద్ద మస్తాన్ హాజరైనారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్రం వచ్చిన అనంతరం పేద ప్రజలకు అండగాలించిన రాజకీయ పార్టీగా భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ అని అన్నారు సామాజిక న్యాయం, పేదలకు భూములు , శ్రమజీవుల హక్కుల కోసం సిపిఐ పార్టీ పోరాటాలు చేసిందని తెలిపారు ఎన్డీఏ కూటమి అధికారానికి రాకముందు ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని అన్నారు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు సిపిఐ పార్టీ స్థాపించి 100 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా జిల్లా మహాసభలు జూన్ 21, 22,23 తేదీలలో దర్శిలో నిర్వహించనున్నట్లు అలాగే రాష్ట్ర మహాసభలు 23,24,25 తేదీలలో ఒంగోలులో నిర్వహించనున్నట్లు తెలిపారు ఈ మహాసభలకు అందరూ హాజరై జయప్రదం చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో సహాయ కార్యదర్శి యస్ కె వై మౌలాలి, కళ్యాణి, స్వప్న, అల్లారమ్మ, గురవమ్మ, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## 14 నుండి విద్యార్థులకు కొత్త బస్ పాసులు

**- విద్యార్థులకు ఏపీఎస్ఆర్ టీసీ అధికారుల సూచన**

**కలెక్టరేట్ ఒంగోలు, పెన్ పవర్ జూన్ 11**

నూతన విద్యా సంవత్సరంలో, విద్యార్థులకు కొత్త బస్సు పాసులు జారీ చేయటంలో భాగంగా, రంగు మార్చబడిన కొత్త బస్ పాసు ఐడి.. టికెట్ స్టాకును సిస్టములో లోడు చేయుటకు, ఇతర సాంకేతిక కారణాల వలన ఈ నెల 12వ తారీఖు, 13వ తారీఖులలో బస్ పాస్ కౌంటర్లు తాత్కాలికముగా నిలుపుదల చేసినట్లు, కొత్త బస్సు పాసులు 14వ తేదీ నుండి యధావిధిగా జారీ చేయబడునని ఆర్టీసీ ఆర్.యం. ఒక ప్రకటనలో తెలియజేశారు. విద్యార్థుల విలువైన సమయం కౌంటరు వద్ద వృథా కాకుండా ఉండటానికి గాను, విద్యార్థులు తమ వివరాలను తామే ముందుగా ఆన్ లైను నందు నమోదు చేసుకొనే అవకాశము కల్పించినట్లు తెలిపారు. విద్యార్థులు తమ పూర్తి వివరాలను సైటు నందు ముందస్తుగా తప్పులు లేకుండా పూరించి, అక్కడ ఇవ్వబడిన ఐడి నంబరును కౌంటరు నందు తెలిపినచో, క్షణాలలో ఎటువంటి ఆలస్యము లేకుండా తమ బస్ పాసును పొందవచ్చునని తెలిపారు. తమ విలువైన సమయాన్ని వృథా చేసుకొనకుండా, ఈనెల ది.14నుండి నూతన బస్సు పాసులు పొందవలసినదిగా విద్యార్థులకు ఆర్.ఎం సూచించారు.

## ఫిట్నెస్ సర్టిఫికేట్ ను రెన్యువల్ చేయించుకోవాలి

**- విద్యా సంస్థల యాజమాన్యాలకు ఉప రవాణా కమిషనర్ ఆదేశం**



**క్రైం రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ జూన్ 11**

గురువారం నుండి స్కూల్, కాలేజీ లు పునః ప్రారంభ సందర్భముగా వారి స్కూల్, కాలేజీ విద్యార్థులను చేరవేయు బస్సులకు పిట్నెస్ సర్టిఫికెట్ చేయించుకోని యెడల వెంటనే పిట్నెస్ సర్టిఫికెట్ (ఎఫ్ సి)ను వెంటనే రెన్యువల్ చేయించుకోవాలని జిల్లా ఉప రవాణా కమిషనర్ ఆర్.సుశీల ఆదేశించారు. అలాగే ప్రభుత్వానికి చెల్లించవలసిన టాక్స్ ను వెంటనే చెల్లించాలని, పర్మిటీ, ఇన్సూరెన్సు, పొల్యూషన్ సర్టిఫికెట్ వాహనము నడుపు చోదకుడకు ఖచ్చితముగా సంబంధిత డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, బస్సు నందు ఫస్ట్ ఎయిడ్ కిట్ ను అమర్చుకోవాలని సూచించారు. డ్రైవర్ హెవీ లైసెన్స్ కలిగి వుండి అయిదు సంవత్సరముల అనుభవము కలిగివుండాలని, స్కూల్ బస్సు నడుపునపుడు డ్రైవర్ రహదారి భద్రతా నియమాలను ఖచ్చితంగా పాటించాలని తెలిపారు. ఈనెల 17 తేదీ నుండి జిల్లా అంతటా మోటార్ వాహన తనిఖీ అధికారులు ప్రత్యేక తనిఖీలు చేపట్టి ఫిట్నెస్ సర్టిఫికెట్, బాక్సీ, పర్మిటీ, ఇన్సూరెన్సు, పొల్యూషన్, డ్రైవింగ్ లైసెన్స్, రహదారి భద్రతా నియమాలను పాటించని స్కూల్.. కాలేజ్ బస్సుల వాహనములకు అపరాధ రుసుము విధించి వాహనములు సీజ్ చేయడం జరుగుతుందని ఆమె తెలియజేశారు.

## నూతన సి.సి రోడ్డు ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న సబ్ కలెక్టర్





**కందుకూరు పెన్ పవర్, జూన్ 11**

పట్టణంలోని కోవూరు రోడ్ లో నూతనంగా నిర్మించిన 18.03 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించిన సి.సి రోడ్, డ్రైన్ మంగళవారం సాయంత్రం కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముందు చూపుతో స్వర్ణాంధ్ర 2047 ముందుకెళ్తున్నారని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధిలో ప్రజల భాగస్వామి చాలా అవసరమని, ప్రజలందరూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వర్ణాంధ్ర విజన్ 2047 సహకరించాలని, కందుకూరు నియోజకవర్గం అభివృద్ధి కొరకు మీ విలువైన సూచనలను సలహాలను ప్రభుత్వానికి అందించవచ్చునని సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కే అనుష, పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, పార్టీ నాయకులు పిడికిడి వెంకటేశ్వర్లు, చదలవాడ కొండయ్య, ముచ్చు శ్రీనివాసరావు, చిలకపాటి మధుబాబు, బెజవాడ ప్రసాద్, షేక్ మున్నా, గడ్డం మాలకొండయ్య, సవిడిబోయిన వెంకటకృష్ణ, మంచిరాజు మురళి మోహన్, కొత్తూరి వెంకట సుధాకర్



వార్డు అధ్యక్షుడు ముప్పవరపు వేణు, గుమ్మ శివ, పీలా శ్రీనివాసరావు, పొడపాటి మాధవ, కొమర రమణయ్య, ఓరుగంటి రామ్మూర్తి, చల్లా మహేంద్ర, బత్తిన ఆదెమ్మ, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## కొలతలు ప్రకారమే కూలీ



**వలేటివారిపాలెం పెన్ పవర్ జూన్ 11**

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలకు కొలతలు ప్రకారమే కూలీ ఇవ్వడం జరుగుతుందని ఎంపీడీఓ నరేంద్ర దేవ్ అన్నారు. బుధవారం పోకూరు గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పనిప్రదేశంలో పని చేస్తున్న కూళీల హాజరు పట్టికను పరిశీలించారు. పనులు జరుగుతున్న తీరును గురించి కూళీలను అడిగి తెలుసుకున్నారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీలకు పని ప్రదేశంలో కొలతలు ఇవ్వాలని ఇచ్చిన కొలతలు ప్రకారమే కూలీ ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని ఉదయం 6 గంటలకు పని ప్రదేశానికి రావాలని తిరిగి 10 గంటలకు వెళ్ళాలన్నారు. జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్ నవులూరి సుబ్బానాయుడు కు తెలిపారు. పని ప్రదేశంలో నీడ, మంచినీళ్ళు టెంట్లు , మెడికల్ కిట్లు ఏర్పాటు చేయాలని చెప్పారు.

## భ్రూణ హత్యలు నిరోధించాలి





**కందుకూరు పెన్ పవర్, జూన్ 11**

భ్రూణ హత్యలు నిరోధించాలి అని కందుకూరు డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ రజని అన్నారు. బుధవారం ప్రీ-కాన్సెప్షన్ అండ్ ప్రీ-నాటల్ డయాగ్నస్టిక్ టెక్నిక్స్ చట్టం లో భాగంగా పట్టణంలోని అజ్మల్ నర్సింగ్ హోమ్, ప్రగతి నర్సింగ్ హోమ్ , న్యూ లైఫ్ హాస్పిటల్ లను ఆకస్మిక తనికి నిర్వహించి, ప్రినేటల్ డయాగ్నస్టిక్ పద్ధతులను నియంత్రించడం ద్వారా ఆడ భ్రూణ హత్యలను నిరోధించడం పిసిపి ఎన్డిటి చట్టం కింద కొన్ని కీలక మార్గదర్శకాలు గురించి కీలక నిబంధనలుతెలియచేశారు- జరిజిస్ట్రేషన్ పునరుద్ధరణజ: జన్యు ప్రయోగశాలలు, క్లినిక్‌లు అల్ట్రాసౌండ్ కేంద్రాలు పిసిపి ఎన్డిటి చట్టంలోని నియమం 8 ప్రకారం ప్రతి 5 సంవత్సరాలకు ఒకసారి తమ రిజిస్ట్రేషన్‌ను నమోదు చేసుకోవాలి పునరుద్ధరించాలి అని తెలిపారు- జరికార్డ్ కీపింగ్, రిపోర్టింగ్జ: ఈ కేంద్రాలు పిసిపి ఎన్డిటి చట్టంలోని నియమం 9(8) ప్రకారం నిర్వహించిన విధానాలు పరీక్షల వివరణాత్మక రికార్డులను నిర్వహించాలి అని తెలిపారు. తగిన అధికారులకు నెలవారీ నివేదికలను సమర్పించాలి అని అన్నారు.

**ప్రవర్తనా నియమావళి:** పిసిపి ఎన్డిటి చట్టంలోని నియమం 18ఎ (6) ప్రకారం ప్రభుత్వానికి త్రైమాసిక నివేదికలను సమర్పించాలి అని అన్నారు. పిసిపి ఎన్డిటి చట్టం లింగ నిర్ధారణ ఆడ భ్రూణ హత్యలను నిరోధించడం, సమతుల్య లింగ నిష్పత్తిని ప్రోత్సహించడం ఆడపిల్లల హక్కులను రక్షించడం లక్ష్యంగా పెట్టుకుంది అని తెలియ చేసారు. ఈ కార్యక్రమం లో సామాజిక ఆరోగ్య అధికారి శ్రీనివాసులు పాల్గొన్నారు.

# వ్యవసాయ శాఖమంత్రి అచ్చెన్నాయుడుతో ఎమ్మెల్యే ఏలూరి భేటీ

- 13న నల్లబర్లీ కొనుగోలుపై సెక్రటేరియట్ వేదిక సమీక్ష
- గోడౌన్స్, స్టోరేజ్,హమాలీలు,ఏజెన్సీలు,టోకెన్ సిస్టం పై మార్గదర్శకాలపై సమావేశం
- హాజరుకానున్న మంత్రి అచ్చన్నాయుడు, ప్రిన్సిపల్ సెక్రటరీ రాజశేఖర్, అగ్రికల్చర్,మార్కెటింగ్ అధికారులు
- విధి విధానాలను ఖరారు చేయనున్న అధికారులు
-17న పర్చూరుకు వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్న రాక
-బర్లీ కొనుగోలును అధికారికంగా ప్రారంభించనున్న మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే ఏలూరి
-తొలిసారి మార్క్ ఫైడ్ ద్వారా బర్లీ కొనుగోలు
-ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు వెల్లడి





**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు,పెన్ పవర్ జూన్ 11**

నల్లబర్లీ పొగాకు అధికారిక కొనుగోలుపై వ్యవసాయ శాఖ మాత్యులు కింజరాపు అచ్చెన్నాయుడు తో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సమావేశమయ్యారు. రాష్ట్రంలో పొగాకు కొనుగోలు సమస్య తీవ్రంగా ఉండడంతో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు రైతాంగ సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తో పలుమార్లు సంప్రదింపులు జరిపారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రైతుల వద్ద ఉన్న నల్లబర్లీ పొగాకును రాష్ట్ర ప్రభుత్వం మార్క్ ఫైడ్ ద్వారా కొనుగోలు చేసేందుకు విస్తృత ఏర్పాటు చేస్తుంది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తో భేటీ అయ్యారు. పొగాకు కొనుగోలుకు సంబంధించి ఈనెల 13న సెక్రటేరియట్ వేదికగా బర్లీ పొగాకు కొనుగోలు మార్గదర్శకాలపై కీలక సమావేశం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే ఏలూరి వెల్లడించారు. 17వ తేదీన వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పర్చూరు వ్యవసాయ మార్కెట్లో బర్లీ కొనుగోలు కేంద్రాన్ని అధికారికంగా ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

13న విధివిధానాలపై సమీక్ష....

పొగాకు కొనుగోలు సంబంధించి విధివిధానాలపై 13 న సెక్రటేరియట్ వేదికగా కీలక సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాజశేఖర్, వ్యవసాయ శాఖ కమిషనర్ ఢిల్లీ రావు, మార్కెటింగ్, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన నున్నారు. ఈ సమావేశంలో తొలిసారి రాష్ట్ర ప్రభుత్వం తరపున బర్లీ పొగాకు కొనుగోలు చేస్తున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లపై పూర్తిస్థాయి సమీక్ష నిర్వహించనున్నారు. ప్రధానంగా గోడౌన్ సామర్థ్యం, నిల్వ ప్రక్రియ, హమాలీల నియామకం, ఏజెన్సీలు, ఆన్లైన్ టోకెన్ విధానం, రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియ సాఫీగా సాగేందుకు విధి విధానాలపై ఈ సమావేశంలో ఖరారు చేయనున్నారు.

17 నుంచి నిరంతర కొనుగోలు....

దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్ర ప్రభుత్వం బర్లీ కొనుగోలుకు కీలక నిర్ణయం తీసుకుంది. 17వ తేదీ ఉదయం 9 గంటలకు పర్చూరు మార్కెట్ యార్డు వేదికగా మంత్రి అచ్చెన్న, ఎమ్మెల్యే ఏలూరి కొనుగోలు కేంద్రాన్ని అధికారికంగా ప్రారంభించనున్నారు. దీంతోపాటు మార్టూరు ఇంకొల్లు కేంద్రాలలో కొనుగోలు ప్రక్రియ ప్రారంభం కానుంది. మార్క్ఫెడ్ ఆధ్వర్యంలో చివరి రైతు పొగాకు నిల్వ కొనుగోలు చేసేలా పటిష్ట ప్రణాళికతో నిరంతరం కొనుగోలు చేయనున్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే ఏలూరి పేర్కొన్నారు. దేశ చరిత్రలో ఇది ఒక నూతన చారిత్రాత్మక నిర్ణయమని ఎమ్మెల్యే ఏలూరి పేర్కొన్నారు.

# డ్రైవర్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్ల నియామకాల కొరకు దరఖాస్తుల ఆహ్వానం

- 12 వ తేదీ ఉదయం ఇంటర్వ్యూలు

**కలెక్టరేట్ ఒంగోలు, పెన్ పవర్ జూన్ 11**

జిల్లాలోని 104 సంచార వైద్య వాహనాల్లో డ్రైవర్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్లు నియామకాల కొరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు 104 సేవల సర్వీస్ ప్రొవైడర్ భవ్య హెచ్ ఆర్ మేనేజర్ తెలిపారు. డాటా ఎంట్రీ ఆపరేటర్ కొరకు డిగ్రీ పూర్తయి, కంప్యూటర్ కోర్సు పూర్తి చేసి ఉండవలెనని, డ్రైవర్ నియామకం కొరకు పదవ తరగతి పాసై, హెవీ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని తెలిపారు. ఆసక్తి అర్హత గల అభ్యర్థులు తమ పూర్తి వివరాలు నమోదు చేసుకుని, తేదీ 12-06-2025 న ఒంగోలు ఓల్డ్ రిమ్స్ వెనుక ఉన్న 108-104 కార్యాలయంలో తమ దరఖాస్తులు, ఒరిజినల్ సర్టిఫికెట్స్, జిరాక్స్ కాపీలతో ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూలకు హాజరుకావాలని తెలిపారు.

# వైభవంగా పోలేరమ్మ తల్లి తిరునాళ







**కొనకనమిట్ల పెన్ పవర్ జూన్ 11**

కొనకనమిట్ల మండల సమీపంలోని వాగుమడుగు గ్రామంలో ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో పోలేరమ్మ తల్లి తిరునాళను బుధవారం వైభవంగా నిర్వహించారు.గ్రామ దేవతగా భావించే పోలేరమ్మ తల్లికి ప్రతి ఏటా నిర్వహించే ఈ తిరునాళ గ్రామస్థుల నమ్మకాలకు,సాంప్రదాయాలకు నిదర్శనంగా నిలుస్తోంది.ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని రంగురంగుల దీపాలతో,పూలతో అద్భుతంగా అలంకరించారు.ఉదయం ప్రత్యేక పూజలు,అభిషేకాలు నిర్వహించిన అనంతరం మధ్యాహ్నం నైవేద్యాలు సమర్పించి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.చుట్టూ పక్కల గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున పోలేరమ్మ తల్లిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ..పోలేరమ్మ తల్లి ఆశీర్వాదంతో గ్రామంలో శాంతి సౌభాగ్యం నిలబడుతోందని అన్నారు.తిరునాళ సందర్భంగా గ్రామంలో టీడీపీ ఆధ్వర్యంలో 4,వైసిపి ఆధ్వర్యంలో 4 విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేసి ప్రభలపై పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.తిరునాళలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సీ.ఐ వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో ఎస్.ఐ ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

# వైవి సుబ్బారెడ్డిని కలిసిన పిడతల ప్రవీణ్ కుమార్ రెడ్డి



**గిద్దలూరు పెన్ పవర్ జూన్ 11**

ఒంగోలులో ఎంపీ వై వి సుబ్బారెడ్డి ని గిద్దలూరు నియోజకవర్గ వైసిపి నాయకులు పిడతల ప్రవీణ్ కుమార్ రెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కాసేపు ఇరువురు గిద్దలూరు నియోజకవర్గ పరిస్థితులపై చర్చించారు. తర్వాత మాజీ సీఎం వైయస్ జగన్మోహన్ రెడ్డి పొదిలిలో పర్యటిస్తున్న నేపథ్యంలో వైవి సుబ్బారెడ్డి తో కలిసి పిడతల ప్రవీణ్ కుమార్ రెడ్డి పొదిలికి విచ్చేశారు. పొదిలి లో వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులివెందుల సతీష్ రెడ్డి ని కలిశారు. అనంతరం పొగాకు రైతులను వైయస్ జగన్మోహన్ రెడ్డి పరామర్శించగా ఆ కార్యక్రమంలో కలిసి పిడతల ప్రవీణ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

# ప్రజా సేవకై పనిచేయండి



**వలేటివారిపాలెం పెన్ పవర్ జూన్ 11**

సచివాలయ సిబ్బంది ప్రజాసేవకై పనిచేయాలని సమయపాలన పాటిస్తూ ప్రజా సమస్యను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ప్రజలను సచివాలయం చుట్టూ తిప్పుకోవద్దని ఎంపీడీఓ నరేంద్ర దేవ్ అన్నారు. బుధవారం ఉదయం పోకూరు గ్రామ సచివాలయం ను తనిఖీ చేసి హాజరు పట్టి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని అన్నారు. ఇచ్చిన సర్వేను సకాలంలో పూర్తి చేయాలన్నారు.

# స్పౌజ్ పింఛన్లు మంజూరు

## ఇన్చార్జి ఎంపీడీవో ఎల్ బ్రహ్మయ్య

**చంద్రశేఖరపురం, పెన్ పవర్ జూన్ 11**

చంద్రశేఖరపురం మండలంలో స్పౌజ్ పింఛన్లు మంజూరు కొరకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల వివరాలను పరిశీలించి అర్హులైన 69 మంది లబ్ధిదారులకు పింఛన్లు మంజూరు అయినట్లు ఇన్చార్జి ఎంపీడీవో ఎల్ బ్రహ్మయ్య తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకంలో భాగంగా 2023 డిసెంబర్ నెల నుండి 2024 అక్టోబర్ వరకు పింఛను పొందుతూ భర్త మృతి చెందిన సందర్భంగా కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రభుత్వము వారి స్థానంలో భార్యలకు పింఛన్లు మంజూరు చేసినట్లు తెలిపారు.

## సి యస్ పురం,కంభంపాడులో

# అంగన్వాడి పిలుస్తుంది కార్యక్రమం





**చంద్రశేఖరపురం, పెన్ పవర్ జూన్ 11**

చంద్రశేఖరపురం మండలంలోని చంద్రశేఖరపురం, కంభంపాడు గ్రామాలలో అంగన్వాడి పిలుస్తుంది కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమమునకు ముఖ్యఅతిథిగా వెలిగండ్ల సిడిపిఓ కృపవరం పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐదు సంవత్సరాలలోపు పిల్లలను అంగన్వాడీ కేంద్రంలో చేర్పించాలని అన్నారు చిన్నపిల్లల ఆరోగ్యం, పోషణ, విద్యకు అంగన్వాడీ కేంద్రాలు కీలక భూమిక పోషిస్తాయని ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు అంగన్వాడీలో తల్లులకు పోషకాహారం, పిల్లలకు ఆరోగ్య పరిక్షలు, విద్యా బోధనలపై ప్రత్యేక శిక్షణలు, పిల్లలకు బొమ్మల ప్రదర్శనలు, బాలల కల్చరల్ ప్రదర్శనలు ఆటలతోపాటు ఆరోగ్య సంబంధిత సూచనలు అందిస్తున్నామని తెలిపారు తల్లితండ్రులకు అంగన్వాడి కేంద్రాల గురించి వివిధ అంశాలపై అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో తల్లులు, పిల్లలు, అంగన్వాడీ టీచర్స్, అంగన్వాడి ఆయాలు పాల్గొన్నారు.

# ఘనంగా ఏరువాక పౌర్ణమి

**వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నాగరికత ఎంత ముందుకు సాగిన నాగలి లేనిదే పని జరగదు రైతులేనిదే పూట గడవదు**

**వ్యవసాయానికి సంబంధించిన పండగే ఏరువాక పౌర్ణమి -ఎమ్మెల్యే సోదరుడు ముత్తుముల కృష్ణ కిషోర్ రెడ్డి**



**గిద్దలూరు పెన్ పవర్ జూన్ 11**

ఏరువాక సాగారో రన్న చిన్నన్నా నీ కష్టమంతా తీరునురో రన్న చిన్నన్నా నవధాన్యాలను గంపేకెత్తుకొని చద్ది అన్నము మూటగట్టుకొని ముళ్ళు గర్రను చేతబట్టుకొని ఇల్లాలు నీ వెంటబెట్టుకొని అని సీనిగేయ రచయిత పేర్కొన్నట్లు ప్రతి ఏడాది ఏరువాక పౌర్ణమి నిర్వహించటం అనాధినుండి వస్తున్న మన ఆచారం , సంప్రదాయం, ఆ ఆచారం ప్రకారం వ్యవసాయశాఖ ఏరువాక పౌర్ణమి , భూమి పూజ కార్యక్రమాన్ని ఏటా నిర్వహిస్తోంది . అందులో భాగంగా బుధవారం గిద్దలూరు మండలం తాళ్లపల్లి గ్రామంలో "ఏరువాక పౌర్ణమి- 2025" కార్యక్రమం నిర్వహించారు . ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు అశోకరెడ్డి సోదరులు ముత్తుముల కృష్ణ కిషోర్ రెడ్డి పాల్గొని ఏరువాక పౌర్ణమి యొక్క ప్రాముఖ్యతను రైతులకు వివరించారు. మన దేశం వ్యవసాయ ఆధారిత దేశం. దేశ ప్రగతి మొత్తం వ్యవసాయం మీదనే ఆధారపడి ఉంటుంది.



అందుకే మన దేశంలో ఎన్నటికీ రైతే రాజు. అలాంటి అన్నదాతలకు ప్రత్యేకమైన పండుగ ఒకటుందని. అదే ఏరువాక పౌర్ణమి అని రైతులకు తెలుపుతూ జ్యేష్ఠ శుద్ధ పౌర్ణమిని ఏరువాక పౌర్ణమి అని అంటారు. ప్రతి ఏటా జ్యేష్ఠ శుద్ధ పౌర్ణమి రోజును మనం ఏరువాక పౌర్ణమిగా జరుపుకోవడం సంప్రదాయంగా వస్తోందని. ఈ ఏడాది జూన్ 11వ తేదీన జరుపుకున్నామని తెలిపారు. ఈ సంవత్సరం సకాలంలో వర్షాలు పడి పంటలు సంవృద్ధిగా పండి, రైతులు ఆర్థికంగా పురోగతి చెందాలని ఆకాంక్షిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమం లో గిద్దలూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ బైలడుగు బాలయ్య, సహాయ వ్యవసాయ సంచాలకులు డి. బాలాజీ నాయక్, మండల వ్యవసాయాధికారులు విజయ భాస్కర్ రెడ్డి, అబ్దుల్ రఫీక్,రాజశ్రీ, మెర్సీ, మహబూబ్ భాష,కొమ్మునూరు సర్పంచ్ రామ సుబ్బారెడ్డి, రైతు నాయకులు మార్తాల సుబ్బారెడ్డి, జయరామిరెడ్డి, నంది శ్రీను, గోపాల కృష్ణ,వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# పొదిలిలో జగన్ పర్యటనలో మహిళలపై దాడి

## నలుగురికి గాయాలు





**పొదిలి, పెన్ పవర్, జూన్ 11**

పొదిలిలో బుధవారం నాడు రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పర్యటనలో మహిళలపై దాడి జరిగింది వైయస్ జగన్ మోహన్ రెడ్డి తన పర్యటనలో భాగంగా పొదిలి చిన్న బస్టాండు సెంటర్ కు రోడ్ షో ద్వారా రాగానే, అక్కడ కొందరు తెలుగు మహిళలు సాక్షి ఛానల్ లో అమరావతి మహిళల పట్ల అనుచిత వ్యాఖ్యలు రావడం పట్ల నిరసన వ్యక్తం చేశారు నల్ల బెలూన్ లతో జగన్ క్షమాపణ చెప్పాలని, గో బ్యాక్ జగన్ అంటూ నినాదాలు చేశారు అయితే అక్కడ వైసీపీకి చెందిన గుర్తు తెలియని వ్యక్తులు చెప్పులు రాళ్లు తదితర వాటితో మహిళ ఆందోళనకారులపై దాడికి పాల్పడ్డారు ఈ సంఘటనలో ముగ్గురు మహిళలతో పాటు మరొక వ్యక్తి గాయపడ్డారు వెంటనే పోలీసులు జోక్యం చేసుకొని దాడికి పాల్పడిన వారిని చెదరగొట్టడంతో ఘర్షణ అంతటితో ఆగిపోయింది మహిళల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు క్షమాపణ చెప్పాలని మహిళలు కోరినప్పటికీ, వైకాపాకు చెందిన వ్యక్తులు మహిళలు అని కూడా చూడకుండా దాడికి పాల్పడడం ఆ పార్టీ విష సంస్కృతికి నిలువెత్తు నిదర్శనమని తెలుగుదేశం నాయకురాలు, మాజీ ఎంపీటీసీ గునుపూడి మాధవి తీవ్రంగా విమర్శించారు ప్రస్తుతం మహిళలపై జరిగిన దాడి సంఘటన చర్చనీయాంశంగా మారింది

## నూతన ఇఓగా బాధ్యతలు స్వీకరించిన ఎస్. చంద్రశేఖర్



**వలేటివారిపాలెం పెన్ పవర్ జూన్ 11**

ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ మాల్యాద్రి లక్ష్మి నరసింహ స్వామి దేవస్థానం నూతన డిప్యూటీ కమిషనర్ మరియు కార్య నిర్వహణాధికారి గా ఎస్. చంద్రశేఖర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇతను అన్నవరం దేవస్థానం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ గా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న కె.వి. సాగర్ బాబు కాణిపాకం దేవస్థాన డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ గా బదిలీపై వెళ్లారు.

## వలేటివారిపాలెం నూతన తహశీల్దార్‌గా నయీమ్ అహ్మద్



**వలేటివారిపాలెం పెన్ పవర్ జూన్ 11**

వలేటివారిపాలెం నూతన తహశీల్దార్ గా నయీమ్ అహ్మద్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ శ్రీనివాసులు కొండపి కి బదిలీ పై వెళ్ళారు. ఆయన స్థానంలోకి ఈయన వచ్చారు. ఈ సందర్భంగా నూతన తహశీల్దార్ నయీమ్ అహ్మద్ కు కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్చం అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కార దిశగా పనిచేస్తానని అన్నారు.

## పోసు పల్లి గ్రామానికి వెళ్లే దారిలో క్షుద్ర పూజలు కలకలం

**భయాందోళన వ్యక్తం చేస్తున్న పరిసర గ్రామాల ప్రజలు.**



**కొమరోలు పెన్ పవర్ జూన్ 11**

కొమరోలు మండలం రెడ్డి చర్ల పంచాయతీలోని పోసుపల్లి గ్రామానికి వెళ్లే దారిలో క్షుద్ర పూజల ఆనవాళ్లు కలకలం రేపేయి. ఆర్ అండ్ బి రోడ్డు పై కొందరు గుర్తుతెలియని వ్యక్తులు పసుపు కుంకుమలు అలంకరించిన బొమ్మలను వేశారు వాటిని చూసిన ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు .ఎవరికైనా హాని తలపెట్టేందుకు క్షుద్ర పూజలు చేశారా? లేక మరో చోట క్షుద్ర పూజలు చేసి వాటిని తెచ్చి రోడ్డుపై వేశారా? అనే సందేహాలను పరిసర గ్రామాల ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. శత్రువులపై పగ తీర్చుకునేందుకు, లేదా వారిని అంతం చేసేందుకు ఇలాంటి క్షుద్ర పూజలు గతంలో చేసేవారని ,అయితే విజ్ఞాన శాస్త్రం అభివృద్ధి చెందిన తర్వాత మూఢనమ్మకాలు, క్షుద్ర పూజలకు విలువ లేకుండా పోయిందని కొందరు విద్యావేత్తలు గ్రామస్తులకు వివరిస్తున్నారు. నిత్యం ప్రజలు రాకపోకలు సాగించే రోడ్డుపై క్షుద్ర పూజల ఆనవాళ్లు కనిపించడంతో పలు గ్రామాల ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. వాటిని రోడ్డుపై నుంచి తొలగించి దూరంగా విసిరి వేసేందుకు కూడా సాహసించలేకపోతున్నారని పరిసర గ్రామాల ప్రజలు చెబుతున్నారు.

### మాతా శిశు వైద్యం, ప్రజల ఆరోగ్యం పట్ల

# రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ

### మంత్రి డోల శ్రీ బాల వీరాంజనేయ స్వామి









**కనిగిరి ఆర్సీఇంచార్జ్ పెన్ పవర్ జూన్ 11**

రాష్ట్ర ప్రభుత్వం మాతా శిశు వైద్యం పట్ల, ప్రజల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుని మెరుగైన వైద్య సేవలు అందేలా కృషి చేస్తున్నట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి తెలిపారు. బుధవారం కనిగిరి లోని కమ్యూనిటి హెల్త్ సెంటర్ లో నూతనంగా ఏర్పాటు చేసిన కంగారు మదర్ కేర్ సెంటర్ ( మదర్ న్యూ బోర్న్ కేర్ యూనిట్)ను జిల్లా కలెక్టర్ శ్రీమతి ఏ తమీమ్ అన్సారియా, స్థానిక శాసన సభ్యులు డా ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డి తో కలిసి రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆసుపత్రిలోని అన్నీ విభాగాలను పరిశీలించి రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, జిల్లా కలెక్టర్, శాసన సభ్యులతో కలిసి వైద్యాధికారులతో సమావేశమై ప్రజలకు వైద్యసేవలు అందించడంలో దిశానిర్దేశం చేశారు. ఆసుపత్రి కి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, వైద్య సేవల పట్ల ఎవరు నిర్లక్ష్యం వహించరాదని స్పష్టం చేశారు. కనిగిరి కమ్యూనిటి హెల్త్ సెంటర్ లో మదర్ న్యూ బోర్న్ కేర్ యూనిట్ ను ప్రారంభించుకోవడం సంతోషదాకమన్నారు. ఈయూనిట్ ను ప్రారంభించుకోవడంలో ఇద్దరిని మనమంతా ప్రత్యేకంగా అభినందించుకోవలసిన అవసరం ఉందన్నారు. ఆలోచన చేసిన జిల్లా కలెక్టర్ శ్రీమతి తమీమ్ అన్సారియా వారిని, ఆలోచనను ఆచరణలో పెట్టిన శాసనసభ్యులు డా. ముక్కు ఉగ్ర నరసింహరెడ్డిని అని అన్నారు. దాతల సహకారంతో మరియు తన సొంత నిధులు వెచ్చించి తన సొంత అమరావతి ఆసుపత్రి కన్నా మెరుగ్గా ఈ మదర్ న్యూ బోర్న్ కేర్ యూనిట్ ను ఏర్పాటు చేసినందుకు శాసన సభ్యులు డా ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డిని ప్రత్యేకంగా అభినందించుకోవలసిన అవసరం ఉందన్నారు. వీరితో పాటుగా లక్నో నుండి వచ్చి ఈ మదర్ కేర్ యూనిట్ అమలు తీరును పర్యవేక్షిస్తున్న కమ్యూనిటి ఎంపవర్మెంట్ ప్రతినిధులను కూడా అభినందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఈమదర్ న్యూ బోర్న్ కేర్ యూనిట్ లో శాసన సభ్యులు తన సొంత నిధులతో ఆరు మంది సిస్టర్స్ ను కూడా నియమించడం అభినందనీయమన్నారు. పుట్టిన ప్రతి బిడ్డ కు మెరుగై న వైద్యం అందచేయడం, పుట్టిన బిడ్డ పూర్తి స్థాయిలో ఆరోగ్యవంతంగా ఉండాలన్నదే ఈ మదర్ న్యూ బోర్న్ కేర్ యూనిట్ ప్రధాన ఉద్దేశం అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా మాతా శిశు వైద్యం పట్ల, ప్రజల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుని మెరుగైన వైద్య సేవలు అందేలా కృషి చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. ప్రజలు కూడా అనవసరం ఖర్చులకు పోకుండా ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలు పొంది ఆర్థికంగా వెసులుబాటు పొందాలని మంత్రి ఈసందర్భంగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా వెంకటేశ్వర రావు, డి సి హెచ్ ఎస్ డా శ్రీనివాస నాయక్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డా వెంకట సుబ్బయ్య,ఆసుపత్రి వైద్యులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్డీఏ కూటమి ప్రభుత్వ విజయోత్సవ కార్యక్రమాలను విజయవంతం చేయండి

*12వ తేదీ ఉదయం 9 గంటలకు విజయోత్సవ కార్యక్రమాలు ప్రారంభం*





**కొమరోలు పెన్ పవర్ జూన్ 11.**

రాష్ట్రంలో ఎన్డీఏ కూడా ప్రభుత్వం ఏర్పడి సంవత్సరకాలం పూర్తి అయిన సందర్భాన్ని పురస్కరించుకొని ఈనెల 12వ తేదీ కొమరోలు తొలి వసంత విజయోత్సవ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లుగా కొమరోలు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బోనేని వెంకటేశ్వర్లు యాదవ్ తెలిపారు .గత ఏడాది జూన్ 12వ తేదీన ఎన్డీఏ కూటమి ప్రభుత్వం తొలి వసంతాన్ని దిగ్విజయంగా పూర్తి చేసుకున్నదని, అంతేకాక ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ ప్రజల ఆదరాభిమానాలను, ఆశీస్సులను పొందుతున్నదని ఆయన తెలిపారు..ఎన్డీఏ కూటమి ప్రభుత్వానికి సారథ్యం వహిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహచర మంత్రుల సహకారం కూటమి పార్టీల శాసనసభ్యుల ప్రోత్సాహంతో అన్ని వర్గాల ప్రజల ఆశీస్సులతో తొలి ఏడాది ప్రజా రంజక పాలన అందించారని ఆయన పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం తొలి వసంతం పూర్తి చేసుకున్న శుభ సందర్భంగా పురస్కరించుకొని ఈ నెల 12వ తేదీన కొమరోలు లోని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మాజీ ఎంపీటీసీ సభ్యులు ముత్తుముల సంజీవరెడ్డి నివాస గృహంలో విజయోత్సవ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లుగా ఆయన తెలిపారు .ఆ సందర్భంగా ఉదయం 9 గంటలకు కేక్ కట్ చేసి విజయోత్సవ ఆనందోత్సవాలను కార్యకర్తలతో కలిసి పంచుకోనున్నట్లుగా ఆయన చెప్పారు .కావున మండలంలోని అన్ని గ్రామాల చెందిన తెలుగుదేశం, జనసేన ,బిజెపి పార్టీల నేతలు, కార్యకర్తలు, అభిమానులు విజయోత్సవ కార్యక్రమాలకు హాజరై విజయవంతం చేయాలని వెంకటేశ్వర్లు యాదవ్ కోరారు.

## పెద్దదోర్నాల తహసీల్దారు అశోక్ కుమార్ రెడ్డి బాధ్యతల స్వీకరణ



**పెద్ద దోర్నాల పెన్ పవర్ జూన్ 11**

మండల కేంద్రంలోని తహసీల్దారుగా ఇటీవల జరిగిన సాధారణ బదిలీలలో భాగంగా నూతన తహసీల్దారుగా చింతలపూడి అశోక్ కుమార్ రెడ్డి నూతన తహసీల్దారుగా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. దోర్నాలలో తహసిల్దారుగా పనిచేస్తున్నటువంటి కే శాంతి కొత్తపట్నం మండలమునకు బదిలీ కావడంతో ఈయన విధులలో చేరటం జరిగింది. ఈ సందర్భంగా నూతన తహసిల్దార్ అశోక్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారికి అవసరమైన సేవలను అందించుటకు కృషి చేస్తానని తెలిపారు అదేవిధంగా తహసిల్దార్ కార్యాలయంలో సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించడం జరిగింది. నూతన తహసిల్దార్‌కు మండలంలోని ప్రముఖులు శుభాకాంక్షలు తెలియజేశారు.

## షిరిడి సాయిబాబా, కలిసా ప్రతిష్ట





**పెద్ద దోర్నాలపెన్ పవర్ జూన్ 11**

పట్టణంలోని షిరిడి సాయిబాబా కలిసి ప్రతిష్ట బుధవారం ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా ఈ ప్రతిష్ట కార్యక్రమంలో సాయిబాబా విగ్రదాత బొగ్గవరపు మణికంత చంద్రశేఖర్ ఆధ్వర్యంలో అర్చకులతో ఘనంగా ప్రతిష్ట నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ సంఖ్యలో పాల్గొని సాయిబాబాను భక్తులు దర్శంచుకున్నారు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉచిత అన్నదాని కార్యక్రమం నిర్వహించారు అనంతరం స్వామివారిని పూరవిధులు ఘనంగా నిర్వహించారు భక్తులు పాల్గొని స్వామివారి దర్శించుకున్నారు ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి తైక్వాండో బంగారు పతకం గ్రహీతలకు ప్రతిభా పురస్కారాలు

**కందుకూరు పెన్ పవర్, జూన్ 11**



పట్టణంలోని బుధవారం ఉదయం గత నెల 28 నుండి ఈనెల 1 వ తేదీ వరకు ఒరిస్సా రాష్ట్రంలోని కటక్ పట్టణంలో జరిగిన 8 వ ఓపెన్ తైక్వాండో నేషనల్ ఛాంపియన్ షిప్ లో కందుకూరు నియోజకవర్గానికి చెందిన క్రీడాకారులు లో బాలికల విభాగంలో బి. లక్ష్మీ అక్షర శ్రీ (బంగారు పతకం) సి. లక్ష్మీ ప్రియ (బంగారు పతకం) బాలుర విభాగంలో ఏ.మన్విత్ రాజ్ (బంగారు పతకం) జి. త్రినాథ్ (బంగారు పతకం) టి. ఉత్తం ప్రేమ్ సాత్విక్ (రజత పథకం) పి. సాయి శ్రీ వాత్సవ్ (రజత పథకం) సి. మోహిత్ కేసరి నందన్ (కాంస్య పథకం) లు సాధించిన క్రీడాకారులను శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు సేవా రత్న డాక్టర్ రవ్వా శ్రీనివాసులు ఆధ్వర్యంలో వారికి శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ ప్రతిభా పురస్కారాలను అందజేశారు.ఈ సందర్భంగా ఆల్ ఇండియా వాసవి సత్ర సముదాయాల ?మీడియా చైర్మన్ డాక్టర్ చక్కా వెంకట కేశవరావు, సొసైటీ అధ్యక్షులు సేవా రత్న రవ్వా శ్రీనివాసులు మాట్లాడుతూ జాతీయస్థాయిలో తైక్వాండో లో కందుకూరికి చెందిన బి. లక్ష్మీ అక్షరశ్రీ కి బంగారు పతకం రావడం కందుకూరు పట్టణానికే గుర్తింపు అని అన్నారు. ఈ తైక్వాండో అనే క్రీడా, స్పోర్ట్స్ కోటాలో గుర్తింపు ఉన్నదని తెలిపారు. అలాగే ప్రతి ఒక్క విద్యార్థి విద్యతో పాటు క్రీడలలో కూడా రాణించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ ఈ.సి.మెంబర్ జయవరపు కిషోర్ ,సభ్యులు బి.వి.ఎస్ ప్రసాద్,బీ.వి.సుబ్బయ్య, తైక్వాండో మాస్టర్ ఎస్కే అబ్దుల్ సలాం,అఖిల్ (బంటి ) తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి రైతు పోరుబాటకు భారీగా పాల్గొన్న మండల వైసీపీ నాయకులు చలో పొదిలి








**పెద్ద దోర్నాల పెన్ పవర్ జూన్ 11**

రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలంటూ పొగాకు రైతులను ఆదుకోవాలని సంకల్పంతో రైతు పోరు బాటకు ప్రకాశం జిల్లా పొదిలి పొగాకు వేలం కేంద్రమునకు మంగళవారం వైసీపీ అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి విచ్చేయు సందర్భంలో దోర్నాల మండలం నుండి వైసీపీ శ్రేణులు ఎర్రగొండపాలెం శాసనసభ్యులు తాటిపర్తి చంద్రశేఖర్ పిలుపుమేరకు భారీగా తరలి వెళ్లడం జరిగింది. ఇందులో భాగంగా మండలంలోని అన్ని గ్రామాల నుండి వైసీపీ శ్రేణులు భారీగా దేవరాజు గట్టు జంక్షన్లో ఏర్పాటు చేసినటువంటి ర్యాలీ కార్యక్రమంలో పాల్గొని తదనంతరం పొదిలిలో జరుగుకార్యక్రమంలో ఏర్పాటు చేసుకున్న ప్రత్యేక వాహనాలలో కార్యకర్తలు, రైతులు నాయకులు భారీగా తరలి వెళ్లడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రైతులు నాయకులను ఎర్రగొండపాలెం శాసనసభ్యులు తాటిపర్తి చంద్రశేఖర్ ప్రత్యేకంగా అభినందించడం జరిగింది . ఈ కార్యక్రమములో మండల వైసీపీ కన్వీనర్ గంట వెంకట రమణారెడ్డి ఎర్రగొండపాలెం గ్రీవెన్స్ సెల్ అధ్యక్షులు వెన్నా వెంకటేశ్వర్ రెడ్డి నాయకులు రావికింది రామారావు అల్లు రాంభూపాల్ రెడ్డి దూదేకుల రసూల్ చిట్టే వెంకటేశ్వర రెడ్డి వల్లభనేని పవన్ కుమార్ వెన్నా పాండురంగారెడ్డి మొద్దు తిరుపతిరావు కృష్ణ నాయక్ గోల్మారు రాజశేఖరరెడ్డి వివిధ గ్రామాల నాయకులు కార్యకర్తలు, అభిమానులు భారీగా హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

## నగర అభివృద్ధిలో డి.జే మార్క్

**- పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం**

**- పాల్గొన్న మంత్రి డా.డోలా, ఎమ్మెల్యే దామచర్ల**









**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ జూన్ 11**

రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు, ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ రావు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి తో కలిసి ఒంగోలు నగరంలోని పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ముందుగా నగరంలోని 18వ డివిజన్ వెంగముక్కలపాలెం నందు 54 లక్షలతో నిర్మించనున్న సీసీ డ్రైన్ కు ఎమ్మెల్యే దామచర్ల శంకుస్థాపన చేశారు. నగరంలోని 15వ డివిజన్ అగ్రహారం గేట్ నందు 48 లక్షలతో నిర్మించిన సీసీ డ్రైన్, 46వ డివిజన్ అంజయ్య రోడ్డు నందు సూర్య బలిజ ఆరామ క్షేత్రం ను ప్రారంభించారు. 46వ డివిజన్ నందు 37 లక్షలతో నిర్మించనున్న సీసీ డ్రైన్ కు శంకుస్థాపన చేశారు. కొత్తపట్నం మండలం రంగాయిపాలెం గ్రామం నందు 90 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్లులకు శంకుస్థాపన చేశారు. ఒంగోలు మండలం యరజర్ల గ్రామం నందు 1.10 కోట్లతో నిర్మించిన సీసీ రోడ్ల ను దామచర్ల జనార్దన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ గంగాడ సుజాత, కార్పొరేటర్లు, వివిధ శాఖల అధికారులు, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

## నేడు ఎన్డీఏ కూటమి వార్షికోత్సవ వేడుకలు

**చంద్రశేఖరపురం, పెన్ పవర్ జూన్ 11**

కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల మేరకు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయ్యి ఒక సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా జరుగుతున్న వార్షికోత్సవ వేడుకలను నేడు చంద్రశేఖరపురం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించనున్నట్లు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు డాక్టర్ బొమ్మనబోయిన వెంకటేశ్వర్లు తెలిపారు మండలంలోని 23 పంచాయతీల గ్రామ పార్టీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కార్యవర్గ అనుబంధ సంస్థల అధ్యక్షులు, కార్యవర్గ కుటుంబ సాధికారి సారధులు, సభ్యులు మరియు సీనియర్ నాయకులు బూత్ కన్వీనర్లు, యూనిట్ క్లస్టర్ ఇన్చార్జీలు, రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, నియోజకవర్గ నాయకులు, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు అభిమానులు మహిళలు పాల్గొని వేడుకలను జయప్రదం చేయాలని కోరారు.

## తెలుగుదేశం పార్టీతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం

### 2029లో ఎమ్మెల్యే ఇంటూరిని మరల గెలిపించుకుందాం

### కందుకూరు మండల టిడిపి అధ్యక్షులు నార్నె రోశయ్య



**కందుకూరు పెన్ పవర్, జూన్ 11**

తెలుగుదేశం పార్టీతోనే ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని కందుకూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నార్నె రోశయ్య అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన పేరు!. తెలుగుదేశం పార్టీ అంటే కేవలం ఒక రాజకీయ పార్టీ కాదు, అది ఒక ఆశయం, ఒక ఉద్యమం, కోట్లాది మంది తెలుగు ప్రజల ఆత్మగౌరవ ప్రతీక అని తెలిపారు. అన్న నందమూరి తారక రామారావు స్థాపించిన ఈ పార్టీ, తెలుగు ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసింది అని అన్నారు. ఆయన చూపిన మార్గంలో పయనిస్తూ, పార్టీ ఎన్నో విజయాలు సాధించి, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించింది. తెలుగుదేశం పార్టీ అంటే పేదల సంక్షేమం, రైతుల అభ్యున్నతి, యువత భవిష్యత్తు. మన నాయకులు ఎప్పుడూ ప్రజల పక్షాన నిలబడ్డారు, వారి కష్టాలను తీర్చడానికి అహర్నిశలు కృషి చేశారు అని అన్నారు. సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటికీ ఆసరాగా నిలిచారు, మౌలిక వసతుల కల్పనతో రాష్ట్రానికి కొత్త రూపునిచ్చారు. విద్య, వైద్యం, ఉపాధి రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారు అని అన్నారు.తెలుగుదేశం పార్టీ అంటే పారదర్శక పాలన, అవినీతి రహిత సమాజం. ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడి, ప్రజల భాగస్వామ్యంతోనే పాలన సాగాలని నమ్మాం అని అన్నారు. అందుకే మన పార్టీ అంటే ప్రజలకు అంత నమ్మకం, అంత విశ్వాసం. తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ ప్రజల మధ్య ఉంటుంది, వారి ఆకాంక్షలను నెరవేర్చడానికి నిరంతరం పాటుపడుతుంది అని అన్నారు. గత ఏడాది మన పార్టీ సాధించిన విజయాలు, అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలు ప్రతి ఒక్కరికీ తెలుసు అని అన్నారు. కందుకూరు గడ్డపై 20 సంవత్సరాల తర్వాత తెలుగుదేశం పార్టీ జెండాను ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కందుకూరు చరిత్రలో ఎవ్వరికి రాని రికార్డు మెజార్టీతో తెలుగుదేశం జెండాను ఎగురవేశారు అని అన్నారు.ఇది మనందరి సమష్టి కృషి ఫలితం. ఈ విజయం కేవలం ఒక మైలురాయి మాత్రమే. ఇంకా సాధించాల్సింది చాలా ఉంది అని అన్నారు. తెలుగుదేశం పార్టీతోనే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి సాధ్యం. రాబోయే రోజుల్లో మరింత అంకితభావంతో ,పనిచేసి, రాష్ట్రాన్ని సువర్ణ ఆంధ్రప్రదేశ్గా తీర్చిదిద్దుకుందాం అని 2029లో ఇంటూరి నాగేశ్వరరావును మరల గెలిపించుకుందామని రోశయ్య తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావడంతో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కు రోశయ్య ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## మహిళల గౌరవాన్ని కించపరిస్తే సహించేది లేదు





**కొనకనమిట్ల పెన్ పవర్ జూన్ 11**

మహిళలను కించపరిచే విధంగా డిబెట్ నిర్వహించి అమరావతిని వేశ్యల రాజధానిగా మాట్లాడిన కృష్ణంరాజుని,కొమ్మినేని శ్రీనివాస్ పై కఠిన చర్యలు తీసుకోవాలని సాక్షి మీడియాని వెంటనే రద్దు చేయాలని మహిళలు నిరసన ర్యాలీ నిర్వహించారు.మండల కేంద్రమైన కొనకనమిట్ల గ్రామంలో మహిళలు బుధవారం భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు.ఈ ర్యాలీ కొనకనమిట్ల సెంటర్ నుండి పోలీస్ స్టేషన్ వరకు కొనసాగింది. ర్యాలీ మధ్యలో మహిళలు సాక్షి పేపర్ కాల్చి,జగన్ డౌన్ డౌన్, సజ్జల డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు.ఈ నిరసన ర్యాలీకి మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా కందుల మాట్లాడుతూ...జగన్ సొంత మీడియా సాక్షిలో అమరావతి మహిళలను వేశ్యలనీ వ్యాఖ్యానించారని దీనికి నిరసనగా ఈ ర్యాలీ చేపట్టినట్లు తెలిపారు.జగన్ రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాలా తీయించారని అన్నారు.కూటమి ప్రభుత్వం ఏర్పడిన మొదటి సంవత్సర కాలంలో పెన్షన్ అమలు చేశామని,మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నామని రేపో,మాపో తల్లికి వందనం కూడా ఇవ్వబోతున్నామని అన్నారు.గత ప్రభుత్వంలో గంజాయి అధికంగా ప్రోత్సహించారని దానిని తగ్గించడానికి సీఎం చంద్రబాబు,మంత్రి లోకేష్ బాబు అహర్నిశలు కష్టపడుతున్నారన్నారు.ర్యాలీ అనంతరం వారు స్థానిక పోలీస్ స్టేషన్ కి వెళ్లి ఏఎస్ఐ,తహసీల్దార్ కి అర్జీ రూపంలో అధికారికంగా ఫిర్యాదు సమర్పించారు.అందులో మహిళల పట్ల అసభ్య వాఖ్యలు చేసిన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని సాక్షి మీడియాని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు బాబురావు,టీడీపీ నాయకులు కామసాని రామిరెడ్డి,భాషాపతి నాయుడు,భీమంజనేయ రెడ్డి,కోడె గురవయ్య యాదవ్,మహిళలు టీడీపీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## ప్రజలకు మెరుగైన వైద్య సేవల పై ప్రత్యేక దృష్టి

**- రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి**

**- జిజిహెచ్ లోతల్లి, నవజాత శిశు సంరక్షణ విభాగం ప్రారంభం**

**- పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, శాసనసభ్యులు దామచర్ల జనార్ధన రావు, ఒంగోలు మేయర్ గంగాడ సుజాత**







**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ జూన్ 11**

వైద్య ఆరోగ్య రంగాన్ని బలోపేతం చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించడంపై తమ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి చెప్పారు. ఒంగోలులోని ప్రభుత్వ సమగ్ర వైద్యశాల(జి.జి.హెచ్) లో నూతనంగా ఏర్పాటుచేసిన తల్లి, నవజాత శిశు సంరక్షణ విభాగాన్ని ( ఎం.ఎన్.సి.యు ) జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, స్థానిక శాసనసభ్యులు దామచర్ల జనార్ధన రావు, ఒంగోలు మేయర్ గంగాడ సుజాతలతో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కంగారు మదర్ కేర్ విధానాన్ని కనిగిరి సామాజిక ఆరోగ్య కేంద్రంలో మన జిల్లాలో మొదటిసారిగా అమల్లోకి తెచ్చామన్నారు. అలాంటి సేవలు కలెక్టర్ ఆలోచన, స్థానిక ఎమ్మెల్యే సహకారంతో ఒంగోలు జి. జి.హెచ్.లో కూడా అందుబాటులోకి వచ్చాయన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నట్లు మంత్రి చెప్పారు. ప్రస్తుతం ప్రారంభించిన ఈ విభాగమే దానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. ఒంగోలులోని మాతా శిశు వైద్యశాల (ఎం.సి.హెచ్) లో కూడా ఇలాంటి సేవలు అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఈ సందర్భంగా కలెక్టరుకు సూచించారు. తద్వారా ఒంగోలులో శిశు మరణాలను సాధ్యమైనంతవరకు తగ్గించవచ్చని అన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్య సదుపాయాలను మెరుగుపరుస్తున్నట్లు చెప్పారు. ప్రైవేటు ఆసుపత్రులకు దీటుగా సేవలు అందిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. ఎమ్మెల్యే జనార్ధన్ రావు మాట్లాడుతూ బరువు తక్కువగా పుట్టిన బిడ్డలకు అత్యవసర వైద్య సేవలు అందించేలా, అదేవిధంగా తల్లితో బిడ్డకు అవసరమైన భౌతిక సంబంధం ఉండేలా కంగారు మదర్ కేర్ విభాగాన్ని ఒంగోలు జి.జి.హెచ్. లో అందుబాటులోకి తెచ్చామన్నారు. ప్రభుత్వ ఆలోచనలు, ఆశయ స్ఫూర్తితో వైద్య సిబ్బంది కూడా పనిచేయాలని ఆయన సూచించారు. ప్రజలకు అవసరమైన అన్ని సదుపాయాలను జి.జి.హెచ్. లో అందుబాటులోకి తెస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి ఇంచార్జ్ సూపరింటెండెంట్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఏడుకొండలు, డిప్యూటీ సూపరింటెండెంట్ డా.కిరణ్ కుమార్, డా.ప్రభాకర్ రావు, అడ్మినిస్ట్రేటర్ అద్దయ్య, కోఆర్డినేటర్ డా.వేణుగోపాల రావు, డెప్యూటీ సిఎస్ఆర్ఎంఓ డా. చెంచయ్య, ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా కోఆర్డినేటర్ డా. హేమంత్, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి శ్రావ్య, ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## 12,13 తేదీలలో కనిగిరి బస్ పాస్ కౌంటర్‌కు సెలవులు

**కనిగిరి ఆర్సీఇంచార్జ్, పెన్ పవర్, జూన్ 11**

నూతన విద్యా సంవత్సరంలో విద్యార్థులుకు బస్ పాస్ లు ఇవ్వడానికి క్రొత్తగా సాఫ్ట్ వెర్ డౌన్లోడ్ చేస్తున్నందున కనిగిరి బస్టాండ్ లో 12, 13 తేదీలలో బస్ పాస్ లు ఇవ్వబడవని డిపో మేనేజర్ మహమ్మద్ సయనా బేగం ఒక ప్రకటనలో తెలియజేసారు. మరల 14వ తేది నుండి బస్ పాస్ లు అందజేయటం జరుగుతుందని ఆమె తెలిపారు.



# బడి బస్సులు భద్రమేనా...?

## నేడు పాఠశాలలు పున: ప్రారంభం

## అనుభవం లేని డ్రైవర్లు.. కాలం చెల్లిన బస్సులు -కెపాసిటీ మించి విద్యార్థుల తరలింపు

**బ్యూరో పెన్ పవర్, ప్రకాశం, నెల్లూరు జూన్ 11**

బడి బస్సులు భద్రమేనా..? అంటే.. కాదనే సమాధానం వస్తోంది. తరచూ స్కూల్ బస్సులు మొరాయిస్తూనే ఉన్నాయి. బ్రేకులు ఫెయిల్ కావటం.. రోడ్డు పక్కకు దూసుకెళ్లడం.. ప్రమాదాలకు గురికావడం సర్వసాధారణంగా మారింది. గత ఏడాది కూడా జిల్లాలో అనేక స్కూల్ బస్సులు ప్రమాదాలకు గురైన ఘటనలు ఎన్నో ఉన్నాయి. ఈ ఏడాది విద్యా సంవత్సరానికి నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో బడి బస్సులు కండీషన్పై అనేక అనుమానాలు తలెత్తుతున్నాయి. ఒక్కొక జిల్లాలోసుమారు 600 పైగా ప్రైవేటు పాఠశాలలు ఉండగా కొన్ని బస్సులు పలు కారణాలు వల్ల ఇంకా ఫిట్నెస్ పరీక్షలు కాలేదు. అలాగే నూతన బస్సులు రిజిస్ట్రేషన్ కాకుండా అనుమతులు కోసం ఎదురుచూస్తున్నాయి. కొన్ని బస్సులకు జిల్లా రవాణా శాఖ అధికారి అనుమతులు లేకుండా తిరుగుతున్నట్లు సమాచారం. నిబంధనలు తుంగలో తొక్కి బస్సులు తిప్పుతున్నా ఆర్టీఏ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

విద్యార్థులు పాఠశాలలకు వెళ్లడం ఎంత ముఖ్యమో తిరిగి భద్రంగా ఇంటికి చేరడం కూడా అంతే ప్రధానం. పాఠశాలల యాజమాన్యాలు విధిగా విద్యార్థులకు భద్రతపై భరోసా కల్పించలేని స్థితిలో ఉన్నాయి. పిల్లల బంగారు భవిష్యత్ కోసం తల్లి దండ్రులు లక్షల రూపాయల్లో వ్యయం చేస్తూ ప్రైవేటు పాఠశాలల్లో చదివిస్తుంటే పాఠశాలల యాజమాన్యాలు మాత్రం నిర్లక్ష్యంగానే వ్యవహరిస్తున్నాయి. కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో విధిగా పాఠశాలల బస్సులకు ఫిట్నెస్ పరీక్షలు చేయించుకోవాల్సి ఉన్నా పలు యాజమాన్యాలు పట్టించుకోవడం లేదు. స్కూల్ బస్సులకు చేయించాల్సిన ఫిట్నెస్ పరీక్షలపై యాజమాన్యాలు నిర్లక్ష్యం చేస్తున్నాయి.విద్యాసంస్థల బస్సులకు ప్రతీ సంవత్సరం ఫిట్నెస్ పరీక్షలు చేసుకోవాలని ప్రభుత్వం నిబంధనలు విధించింది. కానీ కొందరు పాఠశాలల యాజమాన్యాలు విస్మ రిస్తున్నారు. కొన్ని పాఠశాల బస్సుల భద్రత ఆందోళన కలిగిస్తోంది. విద్యార్థులను ఇంటి నుంచి పాఠశాలకు తరలించే బస్సులు ఫిట్ లెస్ గా మారుతున్నాయి. నేటి నుంచి పాఠశాలలు పునః ప్రారంభం కానున్నాయి. పలు ప్రైవేటు పాఠశాలల యజామాన్యాలు విద్యార్థుల అడ్మిషన్లపై దృష్టి సారించి విస్తృతంగా ప్రచారం చేస్తున్నాయి. ఈ క్రమంలో విద్యార్థులను




తరలించే వాహనాలను పట్టించుకోవడం లేదు. పాఠశాలలను తెరిచి బస్సులను రోడ్డుపైకి తీసుకోచ్చేలోపు విద్యా సంస్థల వాహనాలకు ఫిటెనెస్ పరీక్షలు చేయించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఆర్టీఏ నిబంధనల ప్రకారం ప్రతీ విద్యాసంస్థ నియమాన్ని పాటించాల్సి ఉంటుంది.అయితే జిల్లాలో కొన్ని పాఠశాల వాహనాలు 15 సంవత్సరాల కాలపరిమితి పూర్తి చేసుకొని కాలం చెల్లి ఉండడంతో వాటికి ఫిట్నెస్ పరీక్షలు చేయడానికి అధికారులు నిరాకరిస్తున్నారు. కాగా ఒక్కో ఫిట్నెస్ పరీక్షకు సంవత్సరానికి ఒకసారి ఐదు వేల రూపాయలు ఖర్చువుతుంది. ఆయా పాఠశాలల యాజమాన్యాలు ఒక్కో విద్యార్థి నుంచి నెలకు సుమారు వెయ్యి రూపాయల చొప్పున వసూలు చేస్తాయి. ఈ లెక్కన ఒక బస్ సీటింగ్ కెపాసిటీ ఆధారంగా 40 మందికి నెలకు 40 వేల రూపాయలు వసూలు చేస్తారు. ఇష్టారీతిన ఫీజులు వసూలు చేసే స్కూలు యాజమాన్యాలు కేవలం ఫిట్ నెస్ కోసం ఐదు వేల రూపాయలు ఖర్చు చేయడానికి వెనుకాడుతున్నాయి. ఒక్కో జిల్లాలో కొన్ని వేలమంది

విద్యార్థులు ప్రతీ ఏటా విద్యను అభ్యసిస్తున్నారు. వీరితో పాటు ఉపాధ్యాయులు అదనం. పిల్లలను పాఠశాలల నుంచి తీసుకువెళ్లి, తిరిగి ఇళ్లకు చేర్చేందుకు అవసరమైన ప్రైవేటు పాఠశాలల బస్సుల నిర్వహణ ప్రశ్నార్థకంగా మారింది. వేలకు వేలు ఫీజులు గుంజుతున్న స్కూళ్ల యజమాన్యాలు ఫిట్నెస్ లేని వాహనాలను నడుపుతూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయి. పలు ప్రాంతాల్లో కళ్లముందే ప్రమాదాలు కనిపిస్తున్నప్పటికీ యాజమాన్యాలు మాత్రం నిర్లక్ష్యం వీడడంలేదు.

### తప్పించుకుంటున్న యాజమాన్యాలు....

విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే విద్యార్థులను తరలించే వాహనాలకు యాజమాన్యాలు ఫిట్నెస్ పరీక్షలు చేయించాల్సి ఉంది. పాఠశాలల పునః ప్రారంభం కానున్న నేపథ్యంలో యాజమాన్యాలు ఫిట్ నెస్ విషయంలో నిర్లక్ష్యం వహించవద్దని రవాణా శాఖ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. ఆర్టీఏ అధికారులు, పోలీసులు పాఠశాలల బస్సుల తనిఖీలు చేస్తున్నారు. అయితే ముందుగానే సమాచారం తెలుసుకుంటున్న పాఠశాల యాజమాన్యాలు తప్పించుకుం టూ వాహనాలను ఇతర మార్గాల్లో వినియోగిస్తున్నాయన్న ఆరోపణలున్నాయి.

### ప్రభుత్వ నిబంధనలు...

వాహనాలకు ఫిటెనెస్ పరీక్ష చేయించాలనుకుంటే ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలి. పాఠశాలకు సంబంధించిన వివరాలు, డిజిగ్నేషన్, సెల్ నంబర్, బస్సు మోడల్, డ్రైవర్ వివరాలు, అటెండర్, ఫొటోలు, బస్సు నడిచే మార్గం, సీట్ల పరిమితి తదితర విషయాలను నమోదు చేయాలి. ప్రభుత్వ నిబంధనలకు అను కూలంగా వాహనంలో మెడికల్ కిట్లు, గాలి, వెలుతురువచ్చేలా కిటికీలు, సీట్ల మధ్య రాడ్లు అమర్చి ఉండాలి. విద్యార్థులు బస్సులో ఎక్కేందుకు, దిగేందుకు అను కూలంగా 325 మిల్లీమీటర్ల ఎత్తు ఉండేలా బస్సు మెట్లు ఉండాలి. ఆపద సమయంలో బయటకు దిగేందుకు అత్యవసర ద్వారం తప్పకుండా ఏర్పాటు చేసి ఉండాలి.విద్యార్థులు బస్సు దిగేటప్పుడు, ఎక్కేటప్పుడు డ్రైవర్కు కనబడేలా రెండు వైపులా సైడ్ అద్దాలు, అన్ని కిటికీలను కలుపుతూ ఇనుప జాలి అమర్చి ఉండాలి. వాహనం టైర్లు, బ్రేకులు నాణ్యతతో ఉండేలా చూసు కోవాలి. బస్సుపై ఏ పాఠశాలకు చెందినదో తెలిపేలా పూర్తి వివరాలు రాసి ఉండాలి. పాఠశాల వాహనాలు నడిపే డ్రైవర్లకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహించాలి. రాత్రివేళల్లో బస్సులను గుర్తుపట్టేలా నాలుగు వైపులా రేడియం స్టిక్కర్లను ఏర్పాటు చేయాలి. కొన్ని పాఠశాలల్లో అనుభవం లేని డ్రైవర్లతో, కాలం చెల్లిన బస్సులతో, పరిమితికి మించి విద్యార్థులను తరలిస్తున్న సంబంధిత అధికారులు కన్నెత్తి చూడ లేదనే విమర్శలు బలంగా ఉన్నాయి. కావున సంబంధిత అధికారులు స్పందించి బడి బస్సులను భద్రంగా ఉంచాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.










On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, Published at D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS, D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Editor: G.APPARAO, (Responsible for selection of news under the PRB Act ) RNI : APTEL/2014/58046 e-mail:penpower9@gmail.com




# 'ప్రైవేటు' దోపిడీ

## -5వ తరగతికే రూ.1 లక్ష వసూళ్లు
## -ఫీజుల వసూళ్లలో చట్ట ఉల్లంఘన
## - ఉపాధ్యాయుల శ్రమదోపిడి

**పెన్ పవర్, ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో, జూన్ 11**

ఈ చట్టాలు డబ్బున్నోళ్ల చుట్టాలు అని మహా కవి శ్రీశ్రీ ఎప్పుడో అన్నారు. చట్టాలను తయారు చేసే ప్రజాప్రతినిధులు, అమలు చేసే అధికారుల వైఫల్యాల వలన ప్రైవేటు విద్యాసంస్థల్లో నిరంతరం శ్రమ దోపిడీ జరుగుతూనే ఉంది. విద్యాహక్కు చట్టం, ఆర్టీఈ చట్టం వంటి అనేక చట్టాలు ఉన్న కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలు నిబంధనలకు విరుద్ధంగా;;అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయి. ఉపాధ్యాయులకు కనీస వేతన చట్టాన్ని అమలు చేయకుండా వారి శ్రమను దోచుకుంటున్నాయి. ఏపీ లో ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 53, 54 నిబంధనలను బహిరంగంగా ఉల్లంఘిస్తూ, పల్నాడు జిల్లాలోని ప్రైవేటు విద్యాసంస్థలు విచ్చలవిడిగా ఫీజుల వసూళ్లతో విద్యను వ్యాపారంగా మార్చాయి. పల్నాడు;;జిల్లాలో 1,100కి పైగా;;ప్రైవేటు స్కూళ్లు ఈ దందాను నిర్వహిస్తున్నాయి. ఈ సంస్థలు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి లక్షల్లో ఫీజులు వసూలు చేస్తూ, ఉపాధ్యాయులకు కనీస వేతనాలు అందించకుండా వారి శ్రమను దోచుకుంటున్నారు. చాలా స్కూల్స్ కు క్రీడా మైదానాలు లేవు. కనీస సౌకర్యాలు లేవు.;;చట్టాలను ఖాతరు చేయడం లేదు.

**జీవో 53, 54 నిబంధనల ఉల్లంఘన**

జీవో 53, 54 ద్వారా ప్రైవేటు స్కూళ్లు, ఇంటర్మీడియట్ కళాశాలలు వసూలు చేయాల్సిన ఫీజులను స్పష్టంగా నిర్దేశించింది. గ్రామీణ, మున్సిపల్, కార్పొరేషన్ ప్రాంతాల్లో 1 నుంచి 10వ తరగతి వరకు ఫీజులు రూ.10,000 నుంచి రూ.18,000ల లోపు ఉండాలి. ఇంటర్మీడియట్ కళాశాలల్లో ఎంపీసీ, బైపీసీ గ్రూపులకు రూ.15,000%--%20,000, ఇతర గ్రూపులకు రూ.12,000%--%18,000ల లోపు వసూలు చేయాలి. హాస్టళ్లకు రూ.18,000%--%24,000 మాత్రమే ఫీజుగా తీసుకోవాలి. అయితే నరసరావుపేటలోని కార్పొరేట్ స్కూళ్లు 1వ తరగతి నుంచే రూ.1 లక్ష వసూళ్లు చేస్తున్నారు. ప్రైవేటు స్కూల్స్ లో 10వ తరగతికి రూ.50,000కు పైగా, ఇంటర్మీడియట్‌లో ఐఐటీ, జె ఈ ఈ, నీట్ కోర్సుల పేరుతో లక్షల్లో వసూళ్లు చేస్తున్నాయి. పాఠశాల విద్య నియంత్రణ మరియు పర్యవేక్షణ కమిషన్ చైర్మన్ జస్టిస్ ఆర్. కాంతారావు ఈ అధిక ఫీజులపై కఠిన చర్యలు తీసుకుంటామని, నిబంధనలు పాటించని సంస్థల అనుమతులు రద్దు చేస్తామని హెచ్చరించారు. అయినా ఈ హెచ్చరికలు ఫలితం ఇవ్వడం లేదు.

**ఉపాధ్యాయుల శ్రమ దోపిడీ**

జీవో నిబంధనల ప్రకారం స్కూళ్లు సేకరించే ఫీజుల్లో 50శాతం ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది జీతాలకు కేటాయించాలి. 15శాతం భవిష్య నిధి, భీమా కోసం కేటాయించాలి.;;30శాతం గ్రంథాలయాలు, ప్రయోగశాలలు, ఫర్నిచర్ కోసం వెచ్చించాలి. స్కూల్ యాజమాన్యం కేవలం 5శాతం లాభం మాత్రమే పొందాలి. కానీ నరసరావుపేటలోని స్కూళ్లు ఉపాధ్యాయులకు రూ.6,000%--%12,000 మాత్రమే జీతంగా ఇస్తూ కనీస వేతన చట్టాన్ని ఉల్లంఘిస్తున్నాయి. ఈ దోపిడీ వల్ల ఉపాధ్యాయుల జీవన ప్రమాణాలు దిగజారుతున్నాయి.

**క్రీడా మైదానాలు లేవు**

1994 జీవో ప్రకారం ప్రైవేటు స్కూళ్లు విశాలమైన తరగతి గదులు, క్రీడా మైదానాలు, అగ్నిమాపక వ్యవస్థలు, మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యాలను కల్పించాలి. గ్రామీణ, పట్టణ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను బట్టి 800%--%2,220 చదరపు మీటర్ల క్రీడా మైదానం ఉండాలి. అయితే, పల్నాడు జిల్లాలో చాలా స్కూళ్లు ఇరుకు గదులు, అపార్ట్‌మెంట్లలో నడుస్తూ, క్రీడా మైదానాలు లేకుండా విద్యార్థుల ఆరోగ్యం, శారీరక వికాసాన్ని పట్టించుకోవడం లేదు. అగ్ని నిరోధక వ్యవస్థలు, జాతీయ భవన నిర్మాణ నిబంధనలు కూడా పాటించబడటం లేదు.

**25శాతం ఉచిత విద్య అమలు శూన్యం**

విద్యా హక్కు చట్టం (ఆర్ టి ఈ) ప్రకారం, ప్రైవేటు స్కూళ్లు తమ విద్యార్థుల సంఖ్యలో 25శాతం మందికి ఉచిత విద్య అందించాలి. అయితే ఈ నిబంధన ఎక్కడా అమలు కావడం లేదు.;;చట్టంలో ఉన్న లోపాన్ని ప్రైవేటు విద్యాసంస్థలు వినియోగించుకుంటున్నాయి. ఆర్టీఈ చట్టంలో ప్రైవేటు స్కూళ్లలో 25 శాతం ఉచిత ప్రవేశం ఒకటో తరగతిలో మాత్రమే కల్పించబడింది. రెండో తరగతి నుంచి పదో తరగతి వరకు ప్రవేశాలు లేవు. ఎవరైనా ఈ చట్టాన్ని మూడో తరగతిలో గాని ఆపై తరగతిలో గాని ప్రవేశం పొందటానికి వీలులేదు. ఈ నిబంధన వల్ల చట్టం నీరుగారిపోయింది. ఈ నిబంధనలను చట్ట సవరణ చేయాలని అన్ని తరగతుల్లో ప్రవేశాలు కల్పించాలని విద్యార్థి సంఘాలు కోరుతున్నాయి.

**ఒలంపియాడ్, ఐఐటీ పేర్లతో దోపిడీ**

జీవో నిబంధనల ప్రకారం ఒలంపియాడ్, ఈ–టెక్నో, ఐఐటీ, జె ఈ ఈ వంటి పేర్లతో తరగతులు నిర్వహించడం నిషేధం. ఈ పేర్లతో వేలల్లో ఫీజులు వసూలు చేస్తున్న స్కూళ్లపై జిల్లా అధికారులు, విద్యాశాఖ చర్యలు తీసుకోవడం లేదు. ఈ నిబంధనల ఉల్లంఘనను బహిరంగ బోర్డులతో స్కూళ్లు ప్రదర్శిస్తున్నా, అధికారుల నిర్లక్ష్యం కొనసాగుతోంది.

**ప్రజల డిమాండ్**

పల్నాడు జిల్లాలోని ప్రజా సంఘ నాయకులు, స్థానికులు ప్రైవేటు విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. జీవో నిబంధనలను అమలు చేయడం, ఫీజుల పారదర్శకత కోసం బోర్డులు ప్రదర్శించడం, 25శాతం ఉచిత విద్యను అమలు చేయడం, క్రీడా మైదానాలు, సౌకర్యాలను కల్పించడంపై దృష్టి సారించాలని కోరుతున్నారు. విద్యాశాఖ అధికారులు, జిల్లా యంత్రాంగం తక్షణ చర్యలు తీసుకోకపోతే, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మరింత దోపిడీకి గురయ్యే ప్రమాదం ఉంది.

పెన్ పవర్
గుంటూరు | బాపట్ల | పల్నాడు

# ఈనెల 16న స్కిల్స్ డెవలప్మెంట్ వారి ఆధ్వర్యంలో మాచర్ల ఎస్ వి ఆర్ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా





**మాచర్ల జూన్ 11 బుధవారం (పెన్ పవర్ న్యూస్)**

డిపార్ట్మెంట్ ఆఫ్ స్కిల్స్ డెవలప్మెంట్ అండ్ ట్రైనింగ్ వారి అధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ( ఏ పి ఎస్ ఎస్ డి సి ) మరియు ఎస్.వి.ఆర్ డిగ్రీ కళాశాల, మాచర్ల వారి అధ్వర్యంలో జాబ్ మేళను నిర్వహిస్తున్నారు. పల్నాడు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఈ. తమ్మాజి రావు గారు, ఎస్.వి. ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ.వెంకట రామయ్య గారు మాట్లాడుతూ, ఈ నెల 16-06-2025(సోమవారం) ఎస్.వి.ఆర్ డిగ్రీ కళాశాల, మాచర్ల , పల్నాడు జిల్లా నందు జాబ్ డ్రైవ్ ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ జాబ్ డ్రైవ్ ను మాచర్ల నియోజకవర్గ పరిసర ప్రాంత యువతి యువకులు అందరూ ఈ జాబ్ మేళా లో పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొనవలసిందిగా తెలియజేశారు. ఈ జాబ్ మేళాకు సుమారు 10 కంపెనీలు పాల్గొంటున్నాయి, ఉదాహరణకు గోదావరి ఆంధ్ర కార్పోరేటివ్ సొసైటీ బ్యాంక్, మాస్టర్ మైండ్స్, హ్యాపీ మొబైల్స్, పేటియం మరియు జస్ట్ డయల్ వంటి పలు రకాల కంపెనీలు హాజరవుతున్నాయి అని తెలియజేసారు. జీతం వారి విద్యార్తతను బట్టి సుమారు 12,000 %--% 35,000 వెల రూపాయల వరకు ఉండవచ్చని తెలిపారు. ఈ జాబ్ డ్రైవ్ కు ఎస్ఎస్సి,ఇంటర్, ఐటిటఐ, డిగ్రీ, బి.టెక్, డిప్లొమా, ఫార్మసి, మరియు పి.జి విభాగముల వరకు చదువుకున్నటు వంటి 18-45 సంబబల వయసు గల నిరుద్యోగ యువతి యువకులు వారి యొక్క బయోడేటా లేదా రెస్యూమ్, ఎడ్యుకేషన్ సర్టిఫికేట్స్ జిరాక్స్, ఆధార్ నకలు మరియు పాస్ పోర్ట్ ఫోటో తో నేరుగా ఇంటర్వ్యూ కు హాజరు కాగలరు.

**తేదీ:-16-06-2025(సోమవారం)**

సమయం :- ఉదయం 9:00 నుండి సాయంత్రం 04:00 వరకు ఇంటర్వ్యూలు జరుగును.

స్థలం :- ఎస్.వి.ఆర్ డిగ్రీ కళాశాల, ఆర్.టి.సి బస్ స్టాండ్ ఎదురు, యం.జి.యం కాంప్లెక్స్ 1వ అంతస్తు, మాచర్ల , పల్నాడు జిల్లా సంప్రదించవల సిన నంబర్లు: ఆర్. కిరణ్ నాయక్: 7842747682, ఏ. రమ్యా :7702921219, సురేష్ : 9100566581. ఔత్సాహిక యువతి యువకులు ముందుగా అనే వెబ్ సైట్ నందు రిజిస్టర్ చేసుకోగలరు. మరిన్ని వివరములకు పైన తెలిపిన నంబర్లను సంప్రదించగలరు. గమనిక: రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోనటువంటి యువతీ యువకులు జాబ్ డ్రైవ్ జరుగు ప్రదేశం నందు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు అని గమనించగలరు.

# ఎన్డీయే కూటమి ప్రభుత్వం రాకతో అభివృద్ధి పరుగులు - ఎమ్మెల్యే గళ్ళా మాధవి

**పెన్ పవర్ గుంటూరు జూన్, 11**

ఆంధ్రప్రదేశ్ లో ఎన్డీయే కూటమి ప్రభుత్వం రాకతో గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు పెడుతుందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. బుధవారం 22,24 డివిజన్ల పరిధిలో గుంటూరు మెడికల్ క్లబ్ వద్ద నుండి చుట్టుగుంట జంక్షన్ వరకు రూ.50.00 లక్షలతో సెంటర్ డివైడర్ నిర్మాణం, అలాగే కృష్ణబాబు కాలనీలోని గడ్డిమల్లు 5,6 లైన్ అడ్డరోడ్ల లో 49.90 సీసీ రోడ్లు, సీసీ డ్రైన్ల నిర్మాణానికి ఎమ్మెల్యే గళ్ళా మాధవి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ... ప్రజా ప్రభుత్వం ఎన్డీయే కూటమి అధికారం చేపట్టిన సంవత్సర కాలంలోనే అనేక అభివృద్ధి పనులను చేపట్టిందని, శాసనసభ్యురాలుగా తాను గుంటూరు పశ్చిమ నియోజకవర్గములో కోట్లాది రూపాయలతో అనేక అభివృద్ధి పనులు చేపట్టానని, 21వ డివిజన్ లో మీతోనే నేను - మీ వెంటేనేను కార్యక్రమం ద్వారా అనేక సార్లు డివిజన్ లో పర్యటించి సమస్యలను గుర్తించి,



వెంటనే నిధులు మంజూరు చేయించి పనులు చేపట్టానని, గత వైసిపి పాలకులు ఈ నియోజకవర్గాన్ని ముఖ్యంగా శివారు ప్రాంతాలను నిర్లక్ష్యం చేసి సమస్యల కూపంగా మార్చరని మండిపడ్డారు. రానున్న రోజుల్లో శివారు ప్రాంతాల మీదే ప్రధానంగా దృష్టి సారించి, అభివృధికి బాటలు వేస్తానని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. అదే విదంగా ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఏర్పడి గురువారం నాటికీ ఏడాది అవుతున్న సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పిలుపు మేరకు గుంటూరు పశ్చిమ నియోజకవర్గములో భారీ విజయోత్సవ ర్యాలీనీ నిర్వహించనున్నామని, ఈ ర్యాలీలో ఎన్డీయే కూటమి నేతలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయవలసిందిగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ అడకా పద్మావతి, షేక్ నాగుర్, శ్రీరామ్ రాజీవ్ ఆనంద్, షేక్ చిన్న మస్తాన్ వలి, ఆళ్ల హరి, చిన్నం శ్రీకాంత్ , చింతకాయల సాయి, అప్పిశెట్టి రంగ,తుమ్మల నాగేశ్వర రావు,కంచర్ల సాంబ శివరావు, షేక్ బుడే, నంది సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

# సంపన్నులు పీ-4లో భాగస్వాములై, రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలి

**విద్యార్థులతో పాటు పేదలకు చేయూతనివ్వడంపై ధనవంతులు దృష్టి సారించాలి : ప్రత్తిపాటి**

**ఒయాసిస్ వెల్ఫేర్ ఆసోసియేషన్ సభ్యులు పీ-4లో పాలుపంచుకోవాలి : ప్రత్తిపాటి.**

**చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, జూన్ 11 :**

ఆర్థికంగా ఉన్నతస్థానాల్లో ఉన్న వారందరూ, తమ సంపాదనతో ఎలాంటి ఆదరువు లేని పేదల్ని ఆదుకోవాలని, అప్పుడే ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రవేశపెట్టిన పీ-4కు సార్ధకత చేకూరుతుందని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి, పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన విద్యార్థినీ విద్యార్థులకు ప్రత్తిపాటి బుధవారం నగదు బహుమతులు అందచేశారు. పట్టణంలోని పండరీపురంలో కే.జె హాస్పిటల్లో మాజీ ఎమ్మెల్యే, ప్రముఖ వైద్యురాలు డాక్టర్ కందిమళ్ల జయమ్మ ఆధ్వర్యంలో, ఒయాసిస్ వెల్ఫేర్ ఆర్గనైజింగ్ సభ్యులు నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రత్తిపాటి, నిర్వాహకులు... విద్యార్థినీ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థుల భవిష్యత్ గురించి ఆలోచించే దాతలు... పేదల జీవితాలపై కూడా దృష్టిపెట్టాలని, ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన పీ-4లో భాగస్వాములై సమాజానికి మేలు







చేయాలని ప్రత్తిపాటి సూచించారు. డబ్బు.. పలుకుబడి ఉన్నవారు పేదల ఉన్నతికి పాలుపడితే, సమాజం త్వరితగతిన వృద్ధి చెందుతుందని, తద్వారా వారు పరోక్షంగా రాష్ట్రాభివృద్ధికి పాటుపడినట్టేనని ప్రత్తిపాటి అభిప్రాయపడ్డారు. మంత్రి లోకేశ్ చేపట్టిన షైనింగ్ స్టార్స్ ప్రోగ్రామ్ లో భాగంగా పది ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందించడం సంతోషంగా ఉందని ప్రత్తిపాటి చెప్పారు. చిన్నవయసు నుంచే విద్యార్థులు తమ లక్ష్యసాధన కోసం ప్రయత్నించాలని, సరైన ప్రణాళిక, మంచి ఆలోచనతో, నిష్ణాతులైన



గురువుల మార్గదర్శకత్వంలో తాము అనుకున్నది సాధించాలని ప్రత్తిపాటి సూచించారు. కార్యక్రమంలో 21 మంది విద్యార్థినీ విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ.5వేల చొప్పున లక్షా5వేల నగదును ప్రత్తిపాటి అందించారు. ఒయాసిస్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులను పేరుపేరునా అభినందించిన ప్రత్తిపాటి. మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి ముఖ్యమంత్రి దృష్టిని ఆకర్షించాలని వారికి సూచించారు. కార్యక్రమంలో కారుమంచి శివరావు, కరణం విజయ లక్ష్మీ, మారెళ్ళ ఇందిరా, ఒయాసిస్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# రైతు ఆత్మహత్యల్లో రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలిపిన జగన్... వారికి మేలుచేశాననడం పచ్చి అబద్ధం :మాజీమంత్రి ప్రత్తిపాటి

అన్నదాతలకు పంటల బీమా సొమ్ము ఎగ్గొట్టడమేనా జగన్ వారికి అందించిన స్వర్ణయుగం : ప్రత్తిపాటి.

తాను బకాయిపెట్టిన ధాన్యం బకాయిలు కూటమిప్రభుత్వం చెల్లించిందనే వాస్తవాన్ని జగన్ విస్మరిస్తే ఎలా? : ప్రత్తిపాటి

గంగన్నపాలెంలో రైతులతో కలిసి ఏరువాకలో పాల్గొన్న ప్రత్తిపాటి.









**చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, జూన్ 11**

చిలకలూరిపేట: తన పాలనలో రైతు ఆత్మహత్యల్లో రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రస్థానంలో నిలబెట్టిన జగన్... నేడు రైతులకు మేలుచేశానని చెప్పడం సిగ్గుచేటని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. అధికారంలో ఉన్నప్పుడు రైతులకు పంటలబీమా సొమ్ము ఎగ్గొట్టిన వ్యక్తి, నేడు తన పాలన రైతులకు స్వర్ణయుగమని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని ప్రత్తిపాటి ఎద్దేవాచేశారు. చిలకలూరిపేట మండలంలోని గంగన్నపాలెంలో ఏరువాక కార్యక్రమంలో పాల్గొన్న ప్రత్తిపాటి, రైతులతో కలిసి దుక్కిదున్ని ట్రాక్టర్ నడిపారు. అనంతరం గ్రామంలో రూ.8లక్షల వ్యయంతో కొత్తగా వేసిన సీసీరోడ్లు, డ్రైన్లను ప్రారంభించి, స్థానికులను ఉద్దేశించి మాట్లాడారు. పొగాకు రైతుల పరామర్శ పేరుతో జగన్ రాజకీయప్రసంగాలు చేస్తూ, ప్రజల్ని రెచ్చగొట్టేందుకు ప్రయత్నించాడని ప్రత్తిపాటి తెలిపారు. పొలాల్లో ఆరబెట్టిన పొగాకు బేళ్లను జగన్ అనుచరులు పొడిపొడిగా తొక్కి నేలపాలు చేసి రైతులకు తీవ్ర నష్టం కలిగించారని, ఆ నష్టాన్ని ఎవరు భర్తీ చేస్తారో జగన్ చెప్పాలన్నారు. పోలవరం సహా అన్ని ప్రధాన ప్రాజెక్టుల నిర్వహణను గాలికి వదిలేసిన జగన్ తన పాలనలో రైతుల్ని ఎన్నో ఇబ్బందులు పెట్టాడన్నారు. ప్రాజెక్టుల గేట్లకు గ్రీజు కూడా పెట్టించకుండా, వరదకు అవి కొట్టుకుపోయి ప్రజల ప్రాణాలుతీసిన వ్యక్తి, నేడు తాను అంతా మంచి చేశానని చెప్పుకోవడం పచ్చి బూటకం కాదా అని ప్రత్తిపాటి నిలదీశారు.

**వంకాయలపాడులో సీసీరోడ్లు.. డ్రైనేజ్ ల ప్రారంభం**

గంగన్నపాలెంలో ఏరువాక కార్యక్రమం అనంతరం ప్రత్తిపాటి యడ్లపాడు మండలం వంకాయలపాడులో రూ.16 లక్షలతో నిర్మించిన సీసీరోడ్లు, డ్రైన్లను ప్రారంభించారు. అనంతరం ఆయన గ్రామస్తులతో గ్రామాభివృద్ధిలో భాగంగా చేపట్టాల్సిన పనులపై చర్చించారు. గ్రామాభివృద్ధి విషయంలో గ్రామస్తులంతా ఒకేతాటిపై ఉండాలని, పార్టీలు.. కుల, మతాలనే అభిప్రాయాలను పక్కనపెట్టాలని ప్రత్తిపాటి వారికి సూచించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు నెల్లూరి సదాశివరావు, షేక్ టీడీపీ కరీముల్లా, జవ్వాజి మధన్ మోహన్, కామినేని సాయిబాబు, వీర రెడ్డి, చందు, గుర్రం నాగపూర్ణ చంద్రరావు, గట్టినేని రమేష్, శంకరరావు, పోపురి వెంకయ్య, గట్టినేని విజయ్ సాయి, ఎంపీడీవో లు, అధికారులు పాల్గొన్నారు.

## బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించండి



**పెన్ పవర్ బ్యూరో బాపట్ల జూన్ 11**

బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించండి అని కరుణ జీవన్ మినిస్ట్రీస్ వ్యవస్థాపక అధ్యక్షులు ఇనకొల్లు పోలీస్ రావు అన్నారు. బుధవారం కర్లపాలెం లో స్థానిక లంకాలవ దగ్గర ఉన్న గిరిజన విద్యార్థులకు వారు పలకలు, నోటు పుస్తకాలు, పెన్నులు, బలపాలు వారికి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతినెల పదిమందికి చేయూతనిద్దాండ చైతన్యపరుద్దాం లో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను ఉపయోగించుకొని కర్లపాలెం లో నూతనంగా ఏర్పాటు అయిన మోడల్ ప్రైమరీ స్కూల్ కర్లపాలెం యందు తమ పిల్లలను చేర్పించవలసిందిగా ఆయన తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు ఆ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు గార్లపాటి శ్రీనివాసరావు, స్థానిక తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది

**-ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్**

**జిల్లాలో అందుబాటులోకి మరో రెండు గిరిజన గురుకులాలు**



**పెన్ పవర్, నరసరావుపేట ప్రతినిధి, జూన్ 11**

గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. రానున్న ఏడాది కాలంలో జిల్లాలో మరో రెండు గురుకులాలు అందుబాటులోకి రానున్నట్లు పేర్కొన్నారు. నాణ్యమైన విద్యను పిల్లలకు అందిస్తేనే వారికి మంచి భవిష్యత్తు ఉంటుందని చెప్పారు. బుధవారం నాడు మంత్రులు గొట్టిపాటి రవి కుమార్, గిరిజన సంక్షేమ, స్త్రీ %ఇ% శిశు సంక్షేమ శాఖ మంత్రివర్యులు గుమ్మిడి సంధ్యారాణి పల్నాడు జిల్లాలో పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా నరసరావుపేట నియోజకవర్గంలోని పెద్దతురకపాలెంలో మొత్తం రూ.9.40 కోట్లతో నిర్మించిన అభివృద్ధి కార్యక్రమాలను మంత్రులు ప్రారంభించారు. రూ. 8.20 కోట్లతో నిర్మించిన గిరిజన గురుకుల పాఠశాలను మంత్రులు గొట్టిపాటి రవి కుమార్, గుమ్మడి సంధ్యా రాణి, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు ప్రారంభించారు. అనంతరం పెద్దతురకపాలెం నుంచి గురుకులానికి రూ.1.20 కోట్లతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. అనంతరం మంత్రులు ఆశ్రమ పాఠశాలలోని వసతి గృహాలు, వంటశాల, తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థుల భవిష్యత్తు మెరుగుపరచాలన్నదే తమ సంకల్పమని, ప్రభుత్వం గిరిజన విద్యార్థులకు అన్ని విధాలా అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నరసరావుపేట శాసనసభ్యులు అరవింద్ బాబు, జిల్లా కలెక్టర్ మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## భార్యపై పెట్రోల్ పోసి నిప్పంటించిన హత్య కేసులోని నిందితుడిని అరెస్టు చేసిన బాపట్ల రూరల్ పోలీసులు

**పెన్ పవర్ బ్యూరో బాపట్ల జూన్ 11**

బాపట్ల డిఎస్పీ రామాంజనేయులు బాపట్ల రూరల్ పోలీస్ స్టేషన్లో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ..మృతురాలు దూసరి సుభాషిణి ఫిర్యాది గుజ్జర్లపూడి మెరిమ్మ యొక్క ప్రథమ కుమార్తె అయి ఉండి, ఆమె వివాహము ముద్దాయి అయిన దూసరి హరీష్ దాసు తో షుమారు 12 సంవత్సరముల క్రితము వివాహము అయి ఉండి వారికి ఇద్దరు పిల్లలు తారక్, 10 సంవత్సరములు, సాత్విక్, 8 సంవత్సరములు అయి ఉండి, ముద్దాయి దూసరి హరీష్ దాసు ఆటో డ్రైవర్ గా, మృతురాలు దూసరి సుభాషిణి కూలీ పనులకు వెళుతూ చెరువు గ్రామములోని ఆనంద్ నగర్ కాలనీ లో జీవనము సాగించుచున్నారు. మృతురాలి పేరు మీద ఇటీవల రేషన్ షాప్ డీలర్ షిప్ వచ్చినది. ముద్దాయి దూసరి హరీష్ దాసు చాలా కాలము నుండి మృతురాలిని మానసికంగా, శారీరకంగా హింసిస్తూ ఉండేవాడు, ఆ విషయములను మృతురాలు వారి తల్లి వాళ్లకి చెప్పకుండా భరించేది. ఇలా ఉండగా, తేదీ 08.06.2025 రాత్రి సుమారు 7 గంటల సమయములో మృతురాలు ఎవరితోనో ఫోన్ మాట్లాడుతున్నదని ఆమె ఇంటి చుట్టుపక్కల వాళ్ళు గ్రామములో చెడుగా చెపుతున్నారని, ఆ విషయము ముద్దాయి కి తెలిసి మృతురాలిని అనుమానించి, వాళ్ళ అమ్మ, అత్త వాళ్ళని పిలిచి గొడవ చేయడము అయినది. మరలా మరుసటి రోజు అనగా తేదీ 09.06.2025 న ఉదయం ముద్దాయి మరలా మృతురాలితో గొడవ పడి, ముద్దాయికి తన భార్య ఎవరితోనో మాట్లాడుతుందనే అనుమానము పెనుభూతమై, విచక్షణ కోల్పోయి, మృగంగా మారి, ఎలా అయినా సరే, తన భార్య బ్రతికి ఉండటానికి వీలు లేదని, ఆమె ను చంపడానికి నిర్ణయించుకొని, మధ్యాహ్నం సుమారు 12.00 గంటల ప్రాంతములో ఇంటిలో ఎవరూ లేనిది చూసి, ఇంటి వద్ద నుండి మోటార్ సైకిల్ వేసుకొని బయటకి వెళ్లి, మధ్యాహ్నం షుమారు 12.30 గంటల ప్రాంతములో 2 లీటర్ల బాటిల్ లో పెట్రోల్ తీసుకొని ఇంటికి వెళ్లి మంచము పై పడుకొని ఉన్న తన భార్యపై పెట్రోల్ పోసి నిప్పు అంటించాడు. మృతురాలు కేకలు వేసుకుంటూ బయటకు పరిగెత్తుకొచ్చిపడిపోయినది. అది చూసి వాళ్ళ ఇంటి పక్కన నివాసముండే కొప్పుల సుధారాణి మృతురాలి వద్ద కు వెళ్లి మృతురాలి మంటలను గోతముతో ఆర్ప పోగా ముద్దాయి కొప్పుల సుధా రాణి ని తనని కూడా తగలబెడతానని బెదిరించినాడు. అంతలో మృతురాలి కేకలు విని చుట్టుపక్కల వాళ్ళు రావడం చూసి ముద్దాయి అక్కడ నుంచి మోటార్ సైకిల్ వేసుకొని పారిపోయినాడు, మృతురాలి వంటిపై మంటలను



గోతముతో ఆర్చి, తదుపరి 108 అంబులెన్సు లో బాపట్ల గవర్నమెంట్ ఆసుపత్రికి తీసుకెళ్ళినారు. అక్కడ నుండి మెరుగైన వైద్యము కోసము గుంటూరు గవర్నమెంట్ ఆసుపత్రికి తీసుకెళుతుండగా మార్గమధ్యములో తేదీ 09.06.2025 సాయంత్రము షుమారు 5 గంటల సమయములో మృతురాలు చనిపోయినది. బాపట్ల జిల్లా ఎస్పీ తుషార్ డూడి, ఐపీఎస్ హత్య గురించి తెలుసుకుని వెంటనే. హత్య కేసును త్వరితగతిన ఛేదించుట కొరకు ఎస్పీ బాపట్ల డిఎస్పీ జి రామాంజనేయులు, బాపట్ల రూరల్ సి.ఐ కే శ్రీనివాస రావు, ఎస్.ఐ శ్రీనివాసులు మరియు 8 మంది పోలీస్ సిబ్బందిలతో బృందంను ఏర్పాటు చేసినారు. ఎస్పీ ఆదేశాల మేరకు బాపట్ల డిఎస్పీ పర్యవేక్షణలో యువతి హత్య కేసు దర్యాప్తు సాగించిన బాపట్ల రూరల్ సీఐ కే .శ్రీనివాస రావు మృతురాలు కుటుంబ సభ్యులు, ఇతర సాక్షులు చెప్పిన సమాచారం ఆధారంగా, నేర స్థలమును పరిశీలించి, భౌతిక సాక్ష్యాధారాలను పరిగణలోకి తీసుకొని, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి జూన్ 11 వ తేదిన సాయంత్రం 5.30 గంటలకు మధ్యవర్తుల సమక్షంలో నిందితుడిని బాపట్ల టౌన్ లోని కమ్మ కళ్యాణ మండపం వద్ద బాపట్ల రూరల్ సీఐ కే శ్రీనివాస రావు వారి సిబ్బంది సహాయం తో అరెస్టు చేసినారు కేసు దర్యాప్తు వేగవంతంగా నిర్వహించి భౌతిక సాక్ష్యాధారాలను, సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి సేకరించిన ఒకదానికొకటి క్రోడీకరించుకొని సంబంధిత న్యాయస్థానంలో ముద్దాయిపై చార్జి షీట్ దాఖలు చేసి న్యాయస్థానంలో ముద్దాయికి కఠిన మైన శిక్ష పడే విధంగా చర్యలు తీసుకుంటామని డిఎస్పీ జి రామాంజనేయులు తెలిపారు. కేసు ఛేదనలో విశిష్ట కృషి చేసిన బాపట్ల, డిఎస్పీ జి రామాంజనేయులు , బాపట్ల రూరల్ సిఐ కే శ్రీనివాస రావు, ఎస్.ఐ శ్రీనివాసులు, బాపట్ల రూరల్ స్టాఫ్ అందరినీ ఎస్పీ గారు అభినందించినారు.

## కూటమి ప్రభుత్వంలో గ్రామాలు అభివృద్ధి











**వేటపాలెం,పెన్ పవర్ ,జూన్ 11**

కూటమి ప్రభుత్వంలో గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య చెప్పారు. వేటపాలెం మండలం దేశాయిపేట,పాపయ్యపాలెం,రామన్నపేట,చల్లారెడ్డిపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన సిసి రోడ్లను బుధవారం ఆయన ప్రారంభించారు. గ్రామాలలో అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం రహదారులను ఏర్పాటు చేస్తుందన్నారు. ఈ కార్యాక్రమంలో వేటపాలెం మండల తహసిల్దార్ పార్వతి, ఎంపీడీవో రాజేష్ బాబు కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మొక్కలను నాటుదాం పర్యావరణాన్ని పరిరక్షిద్దాం..

## వల్లూరు జయప్రకాష్ నారాయణ, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి..

**పెన్ పవర్ గుంటూరు జూన్.11**

మొక్కలను నాటుదాం పర్యావరణాన్ని పరిరక్షిదాం. మొక్కలను నాటడం సామాజిక భాద్యత" అని వల్లూరు జయప్రకాష్ నారాయణ పిలుపు నిచ్చారు. ప్రపంచ పర్యావరణ వారోత్సవాల సందర్భంగా గుంటూరు పశ్చిమ నియోజకవర్గం 4వ మండల పరిధిలోని అరండల్ పేట శ్రీ మోహన రంగ నాయకస్వామి దేవాలయం దగ్గర మండల అధ్యక్షులు వక్కలగడ్డ తిరుమలరావు ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా వల్లూరు జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాల ప్రజలు కాలుష్యం బారిన పడి అనేక అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని మొక్కలు నాటడమే ఈ సామజిక సమస్యకు విరుగుడు అని అన్నారు. మన ప్రియతమ ప్రధాని నరేంద్రమోడీ పదవి చేపట్టి 11 సంవత్సరాలు అయిన సంధర్భంగా దేశావ్యాప్తంగా మొక్కలు నాటే బృహత్తర కార్యక్రమాన్ని దిగ్విజయంగా బీజేపీ ఆధ్వర్యంలో జరుగుతున్నది అని తెలిపారు.



వాతావరణ కాలుష్యం నుంచి పరిరక్షంచుకొనేందుకు, భూగర్భజలాల శాతాన్ని పెంచుకునేందుకు, ప్రతి ఒక్కరు అమ్మ పేరు మీద మొక్క నాటాలని ఆయన పిలుపునిచ్చారు. బిజెపి జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు మాట్లాడుతూ వాతావరణ కాలుష్యం కారణంగా ప్రజలు శ్వాస కోశ, చర్మ సంబంధిత వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నారని, విరివిగా మొక్కలు నాటడమే దీనికి పరిష్కారమని అన్నారు. మండల అధ్యక్షులు వక్కలగడ్డ తిరుమలరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి పెద్దింటి శ్రీ కృష్ణ చైతన్య, పాలపాటి రవికుమార్, మంత్రి సుగుణ, వెలగలేటి గంగాధర్, భజరంగ్ రామకృష్ణ, చరక కుమార్ గౌడ్, దర్శనం శ్రీనివాసరావు, కార్యక్రమ కన్వీనర్ నారాయణరెడ్డి, అవంతి శ్రీనివాసరావు, గురుదేవరాయలు, మంచెళ్ళ అశోక్, తాడువాయి రామకృష్ణ, ఈదర రత్నరావు, రామకృష్ణరెడ్డి, రామచంద్రరావు, దుర్గాప్రసాద్, చింతపల్లి వెంకట్, కేసంశెట్టి చంద్రశేఖర్, దవళేశ్వరపు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.